



# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక






సంపుటి: 5 సంచిక: 3, పేజీలు - 08

ఆదివారం, జూన్ 1, 2025 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

## దేశంలో విజృంభిస్తున్న కరోనా వైరస్

- 3300 దాటిన కరోనా కేసులు
- దేశంలో గత 24 గంటల్లో నలుగురు కరోనాతో మృతి
- కొత్తగా 685 మందికి కొవిడ్ నిర్ధారణ
- కేరళలో అత్యధికంగా 1,336 యాక్టివ్ కేసులు నమోదు
- ఆందోళన అవసరం లేదు, అప్రమత్తంగా ఉండాలని నిపుణుల సూచన



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** భారత్‌లో మరోసారి కొవిడ్ వైరస్ పంజా విసురుతోంది. గత కొన్ని రోజులుగా రోజు వారీ కేసుల సంఖ్య అమాంతం పెరుగుతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. లక్షణాలు ఉన్న వారికి కొవిడ్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తుండటంతో కొత్త కేసుల సంఖ్య భారీగా పెరుగుతున్నట్లు అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. దీంతో రోజురోజుకూ పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం దేశంలో కొవిడ్ యాక్టివ్ కేసుల సంఖ్య 3395 కి చేరినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ గణాంకాలు చెబుతున్నాయి. గతంలో అత్యధిక కేసులు నమోదైన కేరళలోనే ఇప్పుడు కూడా అధిక కొవిడ్ పాజిటివ్ కేసులు ఉన్నట్లు లెక్కలు పేర్కొంటున్నాయి. దేశంలో

2లో..

## కేసీఆర్‌కు బీఆర్ఎస్, జాగృతి రెండు కళ్లు

### - కేసీఆర్‌పై ఈగ వాలినా ఉరుకోమన్న కవిత

- తెలంగాణ జాగృతికి కొత్త కార్యాలయం
- కేసీఆర్, ఆచార్య జయశంకర్ స్ఫూర్తితో జాగృతి ప్రస్థానమన్న కవిత
- సీఎం రేవంత్ రెడ్డి 'జై తెలంగాణ' నినాదం చేయాలని డిమాండ్
- నదీ జలాలపై జూన్ 2న ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్
- కేసీఆర్‌కు అండగా తెలంగాణ జాగృతి ఉంటుందని వెల్లడి
- కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడమంటే తెలంగాణను అవమానించడమేనని వ్యాఖ్య




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కేసీఆర్ కు నోటీసులు ఇవ్వడం అంటే తెలంగాణకు ఇచ్చినట్లేనని కల్వకుంట్ల కవిత అన్నారు. హైదరాబాద్ లోని బంజారాహిల్స్ లో తెలంగాణ జాగృతి కొత్త కార్యాలయాన్ని ప్రారంభించిన తర్వాత మీడియాతో మాట్లాడారు. జాగృతి స్వతంత్రంగా పని చేస్తుందని అన్నారు. కేసీఆర్ కు బీఆర్ఎస్ ఎలాంటిదో తెలంగాణ జాగృతి కూడా అలాంటిదేనన్నారు. బీఆర్ఎస్ , జాగృతి కేసీఆర్ కు రెండు కళ్లు అని స్పష్టం చేశారు. కాళేశ్వరం కమిషన్ కేసీఆర్ నోటీసులు ఇవ్వడంపై మండిపడ్డారు. కేసీఆర్ పిడికిలి బిగిస్తేనే తెలంగాణ వచ్చిందని అలాంటి నేతకు నోటీసులు ఇవ్వడం ఏమిటన్నారు. అది కాళేశ్వరం కమిషన్ కాదని కాంగ్రెస్ కమిషన్ అని తెలంగాణను అవమానించారని స్పష్టం చేశారు. తెలంగాణ జాగృతిని పద్దెనిమిదేళ్ల కిందట ప్రారంభించామన్నారు. తెలంగాణ ప్రతి ఉద్యమంలోనూ జాగృతి భాగమైందని గుర్తు చేశారు. కేసీఆర్, ప్రొ.జయశంకర్ స్ఫూర్తితోనే జాగృతి ఏర్పాటైందని స్పష్టం చేశారు. ప్రొ.జయశంకర్ చెప్పిన తర్వాతే తెలంగాణ జాగృతి స్థాపించామని ఆయనే తనకు దిశానిర్దేశం చేశారని కవిత తెలిపారు. ఇకపై కొత్త కార్యాలయం నుంచే జాగృతి కార్యకలాపాలు జరుగుతాయన్నారు. తెలంగాణను కోటి ఎకరాల మాగాణం చేసినందుకు కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారా కేసీఆర్‌పై ఈగ వాలినా ఊరుకోం. గోదావరి జలాల్లో వాటా కాపాడకపోతే తెలంగాణ జాగృతి ఉద్యమిస్తుందని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి కనీసం జై తెలంగాణ అని కూడా అనరన్నారు రేవంత్ ఇప్పటికైనా జై తెలంగాణ అని నినదించాలన్నారు. తెలంగాణ అవతరణ దినోత్సవం నాడు అమరవీరులకు నివాళు లర్పించాలి. నివాళులర్పించని వారికి కుర్చీలో కూర్చునే అర్హత లేదని కవిత అన్నారు. ఉద్యమకారులపైకి గన్ తీసుకెళ్లిన వాళ్లు ప్రస్తుతం

2లో..

## పాక్‌తో ఎంత వరకైనా వెళ్తాం

### - బుల్లెట్‌కు బుల్లెట్ తోనే బదులిస్తాం



**భోపాల్ (ప్రశ్న న్యూస్)** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రస్తుతం మధ్యప్రదేశ్ లో పర్యటిస్తోన్నారు. దేవి అహల్యాబాయి మహిళా సశక్తీకరణ్ సమ్మేళన్ లో పాల్గొన్నారు. దతియా, సత్నా ఎయిర్ పోర్టులు సహా పలు ప్రాజెక్టుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భోపాల్ లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ తో కలిసి ప్రసగించారు. ఈ సందర్భంగా ఆపరేషన్ సింధూర్ అంశాన్ని ప్రస్తావించారు ప్రధాని మోదీ. సింధూరం భారతీయ సంప్రదాయంలో మహిళా శక్తికి చిహ్నమని వ్యాఖ్యానించారు. పహల్గామ్‌లో ఉగ్రవాదులు భారతీయుల రక్తాన్ని కళ్లచూశారని, అక్కడితో ఆగకుండా దేశ సంస్కృతి సంప్రదాయాలపై కూడా దాడి చేశారని అన్నారు. దేశ మహిళా శక్తికి సవాలు విసిరారని పేర్కొన్నారు.

2లో..

## 11 నెలల పాలనలో సంక్షేమ జోరు

### - సీఎం చంద్రబాబు కీలక ప్రకటనలు

- 11 నెలల్లోనే సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తున్నామన్న సీఎం చంద్రబాబు
- దేశంలోనే అత్యధికంగా పింఛన్లు ఇస్తున్న రాష్ట్రం ఏపీ అని వెల్లడి
- భవిష్యత్తులో పింఛన్లు మరింత పెంచే అవకాశం ఉందని సూచన
- గత ప్రభుత్వం స్కీముల పేరుతో స్కాములు చేసిందని ఆరోపణ
- జూన్ 1 నుంచి దుకాణాల ద్వారా రేషన్, డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియామకాలు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** అధికారంలోకి వచ్చిన 11 నెలల వ్యవధిలోనే రాష్ట్ర ప్రజలకు అపూర్వమైన రీతిలో సంక్షేమ ఫలాలను అందిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానం మేరకు సూపర్ సిక్స్ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో ఏటా రూ.34 వేల కోట్లను పింఛన్ల కోసం కేటాయిస్తున్నామని, భగవంతుడి ఆశీస్సులు ఉంటే భవిష్యత్తులో ఈ మొత్తాన్ని మరింత పెంచుతామని ఆయన హామీ ఇచ్చారు. అవినీతికి తావులేని సుపరిపాలన అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

2లో..



## రేషన్ దుకాణాల్లోనే సరుకులు

- ప్రతినెలా 1 నుంచి 15 వరకు సరుకుల పంపిణీ
- ఉదయం 8-12, సాయంత్రం 4-8 వరకు షాపులు తెరిచే ఉంటాయి
- దివ్యాంగులు, వృద్ధులకు ఇంటివద్దకే రేషన్ అందించే సౌకర్యం
- గత ప్రభుత్వ ఇంటింటి రేషన్ విధానంపై పవన్ విమర్శలు

2లో..



## గోశాలల అభివృద్ధికి ప్రత్యేక కమిటీ

### - ముఖ్యమంత్రి రేవంత్ నిర్ణయం

- అత్యాధునిక గోశాలల ఏర్పాటుకు సీఎం రేవంత్ ఆదేశం
- రంగారెడ్డి జిల్లా ఎంకేపల్లి గోశాల డిజైన్లకు త్వరలో ఆమోదం
- కనీసం 50 ఎకరాల్లో స్వేచ్ఛగా తిరిగేలా వసతులు
- నిర్వహణలో ధార్మిక సంస్థల భాగస్వామ్యంపై పరిశీలన



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అత్యాధునిక సదుపాయాలతో కూడిన గోశాలలను ఏర్పాటు చేసేందుకు పటిష్టమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గోవుల సంరక్షణ, నిర్వహణ మెరుగుపరిచే దిశగా ఈ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో గోశాలల అభివృద్ధి, నిర్వహణ, సంరక్షణకు సంబంధించిన అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా, గోశాలల ఏర్పాటుకు సంబంధించి ఒక ప్రత్యేక కమిటీని నియమించాలని ఆయన సూచించారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ఎంకేపల్లి గ్రామంలో నిర్మించ తలపెట్టిన గోశాలకు సంబంధించిన డిజైన్లను రాబోయే నాలుగైదు రోజుల్లోగా ఖరారు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ ప్రతిపాదిత కమిటీ, గోశాలల ఏర్పాటుకు సంబంధించిన అన్ని అంశాలపై లోతైన అధ్యయనం చేసి, నిర్దేశిత గడువులోగా సమగ్రమైన, పూర్తిస్థాయి ప్రణాళికను ప్రభుత్వానికి సమర్పించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. తొలి విడతలో భాగంగా, పశుసంవర్ధక, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, వాటి అనుబంధ కళాశాలలు, అలాగే దేవాలయాలకు చెందిన అందుబాటులో ఉన్న భూముల్లో ఈ ఆధునిక గోశాలలను ఏర్పాటు

2లో..

## ఎన్ని కూలాయన్నది కాదు, ఎందుకు కూలాయన్నదే ముఖ్యం

- బ్లూమ్ బర్గ్ ఇంటర్వ్యూలో జనరల్ అనిల్ చౌహాన్ వ్యాఖ్యలు
- ఆరు విమానాలు కూల్చామన్న పాక్ వాదన అబద్ధమని వెల్లడి
- వ్యూహాత్మక పొరపాట్లు సరిదిద్దుకొని, తిరిగి దాడులు చేశామన్న ఆర్మీ చీఫ్



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** పాకిస్థాన్‌తో జరిగిన సైనిక ఘర్షణల్లో తమ యుద్ధ విమానాలు కొన్నింటిని కోల్పోయినట్లు భారత ఆర్మీ చీఫ్ జనరల్ అనిల్ చౌహాన్ పరోక్షంగా అంగీకరించారు. సింగపూర్‌లో శనివారం జరిగిన షాంగ్రి-లా డైలాగ్ సదస్సులో పాల్గొన్న భారత సాయుధ దళాల చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్, బ్లూమ్‌బెర్గ్ టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ కీలక విషయాలు వెల్లడించారు. పాకిస్థాన్ తో జరిగిన సైనిక ఘర్షణలో భారత్ యుద్ధ విమానాలు కోల్పోయిందా, ఆరు జెట్లను కూల్చేశామన్న పాక్ వాదనపై మీరేమంటారని యాంకర్ అడగగా పాకిస్థాన్ తప్పుడు ప్రచారం చేస్తోందని అంటూనే ఎన్ని విమానాలు కూలాయన్నది కాదు, ఎందుకు కూలాయన్నదే ముఖ్యమని

2లో..

## కూటమికి జగన్ రిటర్న్ గిఫ్ట్

### - ముహూర్తం ఫిక్స్

**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఏపీ రాజకీయాలు ఆసక్తి కరంగా మారుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసు కొంటోంది. మూడు పార్టీలు తమ భవిష్యత్ కోసం కొత్త వ్యూహాలను అమలు చేస్తున్నాయి. వైసీపీ లక్ష్యంగా టీడీపీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. బీజేపీ పూర్తిగా పట్టు పెంచుకుంటోంది. కూటమి పాలన పైన ప్రజల్లో వ్యతిరేకత తీవ్ర స్థాయిలో ఉందని జగన్ అంచనా వేస్తున్నారు. వరుస కేసుల తో తమ పార్టీ కేడర్ ను ఇబ్బంది పెడుతున్నారని భావిస్తున్న జగన్ ఇక ప్రభుత్వం పై పోరు బాట కు సిద్ధమయ్యారు. ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించారు. ఇందు కోసం దాదాపు ముహూర్తం ఖరారైంది. ముందుగా కూటమి కంచుకోటల పైనే జగన్ ఫోకస్ చేసారు.

### జగన్ కీలక నిర్ణయం

కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి కానుంది.

2లో..





## మిస్ వరల్డ్ విన్నర్‌గా "ఓపల్ సుచాతా చువాంగ్‌శ్రీ"

### - రన్నర్స్‌గా ఇథియోపియా, పోలెండ్ భామలు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** మిస్ వరల్డ్-2025 విజేతగా థాయ్ లాండ్ సుందరి సుచాత చువాంగ్ శ్రీ నిలిచారు. మిస్ వరల్డ్-2025 కిరీటాన్ని ఆమె సొంతం చేసుకున్నారు. దీంతో ఆమెకు ప్రపంచవ్యాప్తంగా శు భాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. 2024 మిస్ వరల్డ్ క్రిస్టినా పిజ్ కోవా 72వ మిస్ వరల్డ్ కిరీటాన్ని సుచాతా చువాంగ్ కు ధరించారు. ఇక 3వ రన్నరప్ గా మిస్ మార్టినిక్, 2వ రన్నరప్ గా మిస్ పోలాండ్, 1వ రన్నరప్ గా మిస్ పోలెండ్ నిలిచారు. హైదరాబాద్ లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్లో జరిగిన 72వ మిస్ వరల్డ్ పోటీల్లో థాయిలాండ్ కు చెందిన సుచాత చువాంగ్ శ్రీ చరిత్ర సృష్టించారు. మిస్ వరల్డ్-2025 విజేతగా నిలిచారు. మిస్ వరల్డ్ గా ఎంపికైన

2లో..

## కవిత వ్యవహారం "ఓ ఫ్యామిలీ డ్రామా"

- బీఆర్ఎస్‌లో "కల్వకుంట్ల ఆర్ట్స్ క్రియేషన్" నడుస్తోందని ఎద్దేవా
- కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసే పనిచేస్తున్నాయని ఆరోపణ
- వేములవాడ రాజన్న గోశాలలో కోడెల మృతిపై విచారం వ్యక్తం చేసిన సంజయ్
- సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు సైనిక స్థైర్యాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని వ్యాఖ్య



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కవిత వివాదంపై స్పందించిన కేంద్రమంత్రి బండి సంజయ్. కల్వకుంట్ల ఆర్ట్స్ పతాకంపై కాంగ్రెస్ పార్టీ దర్శకత్వంలో కల్వకుంట్ల కవిత ప్రధాన పాత్రధారిగా 'చార్ పత్తా' సినిమాను నడిపిస్తోందన్నారు. ఇదంతా కాంగ్రెస్ ఆడుతున్న డ్రామా అన్నారు సంజయ్. ఇందులో కేసీఆర్ ను జోకర్ గా మార్చారని కవిత ఎపిసోడ్ తో ప్రజలకు ఏమైనా మేలు జరుగుతోందా? మీడియా కూడా ఆలోచించాలన్నారు. ఆరు గ్యారంటీలపై చర్చ జరగకుండా చిట్ చాట్ ల పేరుతో ప్రజల దృష్టి మళ్లించే కుట్ర జరుగుతోందని, గతంలో బీఆర్ఎస్ పాలనలో

2లో..

# 11 నెలల పాలనలో సంక్షేమ జోరు

అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గంలోని చెయ్యేరు గ్రామంలో జరిగిన "పేదల సేవలో" కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న రత్నమ్మ, మరియమ్మ అనే ఇద్దరు మహిళలకు ఆయన స్వయంగా పింఛన్లను అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రజావేదిక బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.

### పింఛన్లతో పేదల జీవితాల్లో వెలుగులు

తమ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 64 లక్షల మందికి ప్రతి నెలా క్రమం తప్పకుండా పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు. రేపు ఒకటో తేదీ ఆదివారం అయినందున, లబ్ధిదారుల సౌకర్యార్థం ఒక రోజు ముందుగానే, అంటే శనివారమే పింఛన్ల పంపిణీ పూర్తి చేశామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పింఛన్ల పంపిణీ అస్తవ్యస్తంగా ఉండేదని, కేవలం రూ.200 ఉన్న పింఛనును తమ ప్రభుత్వమే రూ.2 వేలకు పెంచిందని గుర్తు చేశారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన మాట ప్రకారం, రూ.3,000 పింఛనును రూ.4,000కు పెంచిన ఘనత తమదేనని అన్నారు. డయాలసిస్ చేయించుకుంటున్న రోగులకు రూ.10 వేలు, మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేలు చొప్పున పింఛను అందిస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇచ్చినట్లే, పింఛన్లను కూడా పంపిణీ చేస్తున్నామని, భగవంతుని దయ ఉంటే భవిష్యత్తులో ఈ మొత్తాన్ని మరింత పెంచుతామని పునరుద్ఘాటించారు. భర్త మరణించిన మహిళలకు అండగా నిలిచేందుకు వితంతు పింఛను పథకాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నామని సీఎం తెలిపారు. గత ప్రభుత్వంలో భర్త చనిపోతే భార్యకు వెంటనే పింఛను అందేది కాదని, తాము అధికారంలోకి వచ్చాక 71,380 మందికి రూ.4 వేల చొప్పున పింఛను అందించామని వివరించారు. రెండు నెలల పింఛను కలిపి తీసుకుంటున్న 1,22,975 మంది, మూడు నెలల పింఛను కలిపి తీసుకుంటున్న 9,176 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.111.41 కోట్లను విడుదల చేసినట్లు వెల్లడించారు. మనకంటే ఆర్థికంగా బలమైన, అధిక ఆదాయం కలిగిన రాష్ట్రాలు ఉన్నప్పటికీ, వారికంటే మనమే ఎక్కువ పింఛను అందిస్తున్నామని చంద్రబాబు అన్నారు. ఉదాహరణకు, దేశంలోనే అత్యధిక ఆదాయం కలిగిన మహారాష్ట్రలో రూ.1000, తెలంగాణలో రూ.2,500 మాత్రమే పింఛను ఇస్తున్నారని పోల్చి చెప్పారు. ప్రతి ఇంటికీ పెద్ద కొడుకులా అండగా ఉంటానన్న తన మాటను నిలబెట్టుకున్నానని, ఏడాదికి 100 రోజులు కష్టపడితే వచ్చే రూ.30 వేల ఆదాయం కంటే, తామిచ్చే రూ.48 వేల పింఛనే ఎక్కువని ఆయన అన్నారు.

### రేషన్ పంపిణీ, ఉద్యోగాల భర్తీపై కీలక ప్రకటనలు

జూన్ 1వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా రేషన్ దుకాణాల ద్వారా సరుకుల పంపిణీని పునఃప్రారంభిస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. వృద్ధులు, దివ్యాంగులకు వారి ఇళ్ల వద్దకే రేషన్ సరుకులు అందిస్తామని, రేషన్ వద్దనుకునే వారికి నగదు బదిలీ (డీబీటీ) పద్ధతిలో డబ్బులు అందజేస్తామని తెలిపారు. గతంలో డోర్ డెలివరీ పేరుతో అవకతవకలు జరిగాయని, రేషన్ బియ్యాన్ని కాకినాడ పోర్టుకు తరలించి మాఫియాను నడిపారని ఆరోపించారు. విద్యా వ్యవస్థ బలోపేతంలో భాగంగా, ఈ ఏడాది జూన్ నెలలో డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి, నియామక పత్రాలు అందజేస్తామని సీఎం హామీ ఇచ్చారు. "తల్లికి వందనం" పథకం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంతమందికీ తల్లుల ఖాతాల్లోకి తలసరి రూ.15 వేలు జమ చేస్తామన్నారు. "అన్నదాత" పథకం ద్వారా అర్హులైన ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు అందిస్తామని, మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీసే 217 జీవోను రద్దు చేశామని గుర్తుచేశారు. మత్స్యకారులకు రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. పేదల ఆకలి తీర్చేందుకు రూ.5కే నాణ్యమైన భోజనం అందించే అన్నా క్యాంటీన్లను త్వరలో ప్రతి నియోజకవర్గానికి విస్తరిస్తామన్నారు. వివాదాస్పద ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను ఇప్పటికే రద్దు చేశామని, చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ రీయింబర్స్‌మెంట్‌కు ఉత్తర్వులు జారీ చేశామని చెప్పారు. పవర్ లూమ్‌లకు 500 యూనిట్లు, హ్యాండ్ లూమ్‌లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. స్వర్ణకారుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశామని, గీత కార్మికులకు మద్యం దుకాణాల్లో 10 శాతం రిజర్వేషన్ కల్పించామని, ఎస్సీ వర్గీకరణ ద్వారా సామాజిక న్యాయం చేశామని వివరించారు. దేవాలయాల్లో బ్రాహ్మణులు, నాయీ బ్రాహ్మణులను పాలకమండళ్ల సభ్యులుగా నియమించామని, వేద విద్య అభ్యసించే నిరుద్యోగ యువతకు "యువగళం" కింద నెలకు రూ.3 వేలు అందిస్తున్నామని తెలిపారు. "దీపం" పథకం కింద అర్హులైన మహిళలకు ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందిస్తామని, ఇకపై ప్రతి నాలుగు నెలలకు ఒకసారి గ్యాస్ సిలిండర్ల డబ్బులను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించారు.

### గత ప్రభుత్వ పాలనపై విమర్శలు, అభివృద్ధిపై దృష్టి

గత పాలకులు స్కీముల పేరుతో స్కాములకు పాల్పడ్డారని, రాజకీయ ముసుగులో నేరాలు ఘోరాలు చేశారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్రస్థాయిలో విమర్శించారు. ప్రస్తుతం ప్రజా ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని, తప్పు చేసే వారిని చండశాసనుడిలా వెంటాడతానని హెచ్చరించారు.

### పాస్టర్ మరణంపై దుష్ప్రచారం చేశారు

ఇటీవల ఒక పాస్టర్ మరణాన్ని హత్యగా చిత్రీకరించి కొందరు దుష్ప్రచారం చేశారని, బాబాయ్‌ని చంపి గుండెపోటుగా చిత్రీకరించి డ్రామాలడారని పరోక్షంగా వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ హయాంలో తిరుమల తిరుపతి దేవస్థానంలో కూడా అరాచకాలు జరిగాయని, ఇప్పుడు తామేదో విఫలమైనట్లు విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఒకప్పుడు హైదరాబాద్‌లో మతకల్లోలాలు జరిగితే, టీడీపీ అధికారంలోకి వచ్చాక మతసామరస్యాన్ని కాపాడిందని, రాయలసీమలో ఎన్నికలొస్తే బాంబులు అడిగే పరిస్థితి నుంచి ఫ్యాక్షన్ జాడ లేకుండా చేశామని గుర్తుచేశారు. అంబేద్కర్, ఎన్టీఆర్, రంగా వంటి మహనీయుల విగ్రహాలను కూడా వదలకుండా విగ్రహ రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఆర్థిక ఉగ్రవాదులు సమాజాన్ని అతలాకుతలం చేయాలని చూస్తున్నారని, వారి ఆటలు సాగనివ్వబోమని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో కనీసం ఒక్క రోడ్డు కూడా వేయలేదని, రాష్ట్రమంతటా రోడ్లపై గుంతలు పెట్టి పోయారని విమర్శించారు. ఆ గుంతలు పూడ్చేందుకు రూ.1,200 కోట్లు ఖర్చయిందని, 20 వేల కిలోమీటర్ల రోడ్లకు మరమ్మతులు చేశామని తెలిపారు. చెత్తపైనా పన్ను వేశారు కానీ చెత్త మాత్రం తీయలేదని, తాము రాగానే చెత్త పన్ను రద్దు చేశామని, ఈ ఏడాది అక్టోబర్ నాటికి 83 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను తొలగిస్తామని చెప్పారు.

### కోనసీమ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

కోనసీమ ఒకప్పుడు అందాలసీమగా విలసిల్లిందని, కానీ ప్రస్తుతం ఇక్కడ తలసరి ఆదాయం తగ్గిందని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధిలో కోనసీమ కంటే అనంతపురం ముందుందని పేర్కొన్నారు. ఆక్వా సాగు, కొబ్బరి తోటల ద్వారా కొంతవరకే ఆదాయం వస్తోందని, పాడి పరిశ్రమలను కూడా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. కొబ్బరి తోటల్లో అంతర పంటగా కోకో లేదా పశు గ్రాసం వేస్తే ఆదాయం రెట్టింపు అవుతుందని సూచించారు. కోనసీమ జిల్లాలో పేదలకు రెండు గేదెల చొప్పున అందించి, వారి ఆర్థిక స్వావలంబనకు తోడ్పడతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తన మిత్రుడు, దివంగత లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగిని గుర్తు చేసుకున్నారు. సాధారణ కుటుంబంలో పుట్టి న్యాయవాద వృత్తి చేపట్టిన దళిత నేతను పార్లమెంట్ స్పీకర్‌ను చేసిన ఘనత తెలుగుదేశం పార్టీదేనని అన్నారు. టీడీపీ అన్ని కులాలు, అన్ని వర్గాల పార్టీ అని పునరుద్ఘాటించారు. 1996లో గోదావరికి భారీ వరదలు వచ్చినప్పుడు తాను రాజమండ్రికి సచివాలయాన్ని తరలించి 15 రోజుల పాటు అక్కడి నుంచే సహాయక చర్యలను పర్యవేక్షించిన విషయాన్ని గుర్తు చేశారు.

### స్థానిక సమస్యలపై తక్షణ స్పందన, హామీలు

సభా వేదికపై పలువురు తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురాగా, ఆయన సానుకూలంగా స్పందించి తక్షణ సాయం ప్రకటించారు. డయాబెటిస్ కారణంగా కాలు కోల్పోయిన పోలిశెట్టి దుర్గాప్రసాద్‌కు పింఛను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. బీటెక్ చదివిన ఆయన కుమార్తె సత్య అనితకు ప్రభుత్వం తరపున రూ.1.50 లక్షల ఆర్థిక సాయంతో పాటు ఉద్యోగం కల్పిస్తామని, అలాగే బీఎస్సీ కంప్యూటర్స్ చదివిన సాయి లక్ష్మీ చంద్రకు కూడా ఉద్యోగావకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో 5 లక్షల మంది వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్నారని, ఈ విధానాన్ని మరింత ప్రోత్సహిస్తామని చెప్పారు. క్యాన్సర్‌తో భర్తను కోల్పోయి, ముగ్గురు ఆడపిల్లలతో నిరాశ్రయురాలైన మడికి లక్ష్మికి పింఛనుతో పాటు ఇల్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. మార్గదర్శి సంస్థ ప్రతినిధి నాగేంద్ర రావు ముందుకు వచ్చి లక్ష్మి కుటుంబానికి ఆర్థిక చేయూత అందిస్తానని, ఆమె ముగ్గురు పిల్లల చదువు, వైద్య ఖర్చులు భరిస్తానని ప్రకటించారు. ఇస్త్రీ పనిచేసుకునే భర్తతో, సొంత ఇల్లు లేకుండా ఇబ్బంది పడుతున్న చెయ్యేరు గ్రామానికి చెందిన సత్యవతి కుటుంబానికి కూడా మార్గదర్శి ప్రతినిధి రామరాజు ఆర్థిక సాయం చేసేందుకు ముందుకొచ్చారు. మరో ఐదు కుటుంబాలను దత్తత తీసుకుంటానని ఆయన తెలిపారు. ముమ్మిడివరం నియోజకవర్గ అభివృద్ధికి పలు హామీలు ఇచ్చారు. పల్లంకుర్రు-మూలపాడు వంతెన, ముమ్మిడివరం-కాట్రేనికోన ఆర్ అండ్ బీ రోడ్డు, గోగులంక వంతెన నిర్మాణ పనులను చేపడతామన్నారు. కుండలేశ్వరం ఫ్లడ్ బ్యాంక్ ఆధునీకరణ పనులకు నిధులు మంజూరు చేస్తామని, చెయ్యేరు గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో విద్యార్థినుల కోసం బీసీ రెసిడెన్షియల్ స్కూలు, కాలేజీ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇటీవల గోదావరిలో స్నానానికి వెళ్లి మరణించిన విద్యార్థుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందిస్తామని తెలిపారు.

రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి రూ.47,456 కోట్లు కేటాయించామని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ధాన్యం రైతులకు రూ.1,670 కోట్లు విడుదల చేశామని, ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి డబ్బులు జమ చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం పంచాయతీలకు రూ.990 కోట్ల బకాయిలు పెట్టిందని, ఆ నిధులను విడుదల చేసి, ఫైనాన్స్ కమిషన్ నిధులను కూడా తెచ్చామని చెప్పారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవతో ఒక్క రోజులోనే అన్ని పంచాయతీల్లో పనులు ప్రారంభమయ్యాయని, "పల్లె పండుగ" కింద రూ.4,500 కోట్లతో 30 వేల పనులకు శ్రీకారం చుట్టామని, ఈ కార్యక్రమాన్ని మళ్లీ ప్రారంభిస్తున్నామని వెల్లడించారు.

# దేశంలో విజృంభిస్తున్న కరోనా వైరస్

అత్యధిక కేసులు ఉన్న రాష్ట్రంగా కేరళలో నిలవగా ఆ రాష్ట్రంలో 1,336 కేసులు ఉన్నట్లుగా కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఆ తర్వాత మహారాష్ట్ర, ఢిల్లీలు ఉన్నాయని తెలిపింది. గత 24 గంటల్లో దేశంలో నాలుగు మరణాలు నమోదయ్యాయని ఢిల్లీ, కేరళ, కర్ణాటక, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో ఒక్కో కొవిడ్ బాధితులు మృతి చెందినట్లు వెల్లడించింది. గత 24 గంటల్లో 685 కొత్త కేసులు నమోదయ్యాయని పేర్కొంది. ఇక జనవరి నుంచి ఇప్పటివరకు దేశంలో కరోనా బారిన పడి చనిపోయిన వారి సంఖ్య 26కి చేరినట్లు తెలిపింది. మే 22వ తేదీన దేశంలో 257 యాక్టివ్ కేసులు ఉండగా మే 26వ తేదీ నాటికి అవి 1,010కి పెరిగాయని ఇక శనివారం నాటికి 3,395కి చేరినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ వర్గాలు వెల్లడించాయి. దేశంలో కొవిడ్ వైరస్ పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నామని కేంద్ర ప్రభుత్వ అధికారిక వర్గాలు తెలిపాయి. ఇన్‌ఫెక్షన్ల తీవ్రత తక్కువగా ఉందని పేర్కొనడం కాస్త రిలీఫ్‌గా ఉందని పేర్కొన్నాయి. కొవిడ్ పట్ల ఎవరూ ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని సంబంధిత వర్గాలు చెప్పాయి. కేరళలో 1336 యాక్టివ్ కేసులు, మహారాష్ట్ర 467, ఢిల్లీలో 375, గుజరాత్ 265, కర్ణాటక 234, పశ్చిమ బెంగాల్ 205, తమిళనాడు 185, ఉత్తర్‌ప్రదేశ్ 117 కేసులు ఉన్నట్లు కేంద్రం వివరించింది. పశ్చిమ-దక్షిణ ప్రాంతాల్లోని నమూనాల జన్యు శ్రేణిని పరిశీలించినప్పుడు.. ప్రస్తుత కేసుల పెరుగుదలకు కారణమైన వేరియంట్లు తీవ్రమైనవేవి కావని.. ఒమిక్రాన్ సబ్ వేరియంట్స్ అని తేలిందని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజీవ్ బెహ్ల్ పేర్కొన్నారు. ఒమిక్రాన్ 4 సబ్ వేరియంట్లు ఎల్ఎఫ్.7, ఎక్స్ఎఫ్‌జీ, జేఎన్.1, ఎన్‌బీ.1.8.1 గా గుర్తించారు.

# కేసీఆర్‌కు బీఆర్ఎస్, జాగృతి రెండు కళ్లు

రాష్ట్రానికి సీఎం అయ్యారని మండిపడ్డారు. తెలంగాణ పథకాలకు తెలంగాణ వారి పేర్లే పెట్టాలని కానీ రేవంత్ రెడ్డి ఇతరుల పేర్లు పెడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ యువ వికాసం అని ఉండాలి రాజీవ్ యువవికాసం అని కాదు. వేరే రాష్ట్రం తెలంగాణ నీళ్లు తీసుకెళ్తుంటే మాట్లాడలేని పరిస్థితి రేవంత్‌దన్నారు. బనకచర్ల ప్రాజెక్ట్‌పై రేవంత్ ఎందుకు మాట్లాడటం లేదు. గోదావరి నీళు శాశ్వతంగా దూరం కాబోతున్నాయన్నారు. జాగృతికి ప్రత్యేకంగా కార్యాలయం ప్రారంభించి ఇక బీఆర్ఎస్ తో సంబంధం లేకుండా కార్యకలాపాలు నిర్వహించాలని అనుకోవడంతో కవిత సొంత పార్టీ దిశగా మరో అడుగు ముందుకేసినట్లుగా రాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి. కేసీఆర్ ఆశీస్సులతోనే తాను ఈ రాజకీయ అడుగులు వేస్తున్నానన్నట్లుగా కవిత వ్యవహరిస్తున్నారు. జాగృతి కూడాకేసీఆర్ కు బీఆర్ఎస్ అంత సమానం అని చెప్పడం ద్వారా కేసీఆర్ వ్యతిరేకించబోరన్న సంకేతాలు ఇచ్చారు. ఇప్పుడు కేసీఆర్ ఎలా స్పందిస్తారన్నదానిపై కవిత రాజకీయ వ్యూహం అధారపడి ఉంటుందని అంచనా వేస్తున్నారు.

# పాక్‌తో ఎంత వరకైనా వెళ్తాం

భారత్ కు సవాల్ విసరడం అనేది- ఎంత ప్రమాదకర.. ప్రాణాంతకరమైనదో ఆపరేషన్ సింధూర్ ద్వారా శత్రుదేశానికి తెలియజేశామని మోదీ అన్నారు. ఉగ్రవాదులు, ఉగ్రవాద సంస్థలు, వాటి యజమానులకు ముఖం పగలిలా సమాధానం ఇచ్చామని పేర్కొన్నారు. పహల్గామ్ లో ఉగ్రవాదుల దాడికి ప్రతీకారం తీర్చుకోవాలని, శత్రుదేశానికి వ్యతిరేకంగా పోరాడాలని దేశం మొత్తం కోరిందని ప్రధాని మోదీ చెప్పారు. పహల్గామ్ ఉగ్రవాద దాడికి వ్యతిరేకంగా 140 కోట్ల మంది ప్రజలు ప్రజలు ఒక్కటయ్యారని, ఏకతాటిపైకి వచ్చారని ఆయన గుర్తు చేశారు. బుల్లెట్ కు బుల్లెట్ తోనే సమాధానం ఇవ్వాలని ఒక్కసారిగా గర్జించారని పేర్కొన్నారు. ఆపరేషన్ సింధూర్ లో బీఎస్ఎఫ్ పెద్ద పాత్ర పోషించిందని మోదీ కితాబిచ్చారు. జమ్మూ కాశ్మీర్, పంజాబ్, గుజరాత్, రాజస్థాన్ సరిహద్దుల్లో బీఎస్ఎఫ్ జవాన్లు రెప్పవాల్చకుండా పహారా కాశారని ప్రశంసించారు. సరిహద్దు కాల్పులకు తగిన సమాధానం ఇచ్చారని, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ నుండి శత్రువుల పోస్టులను నాశనం చేశారని అన్నారు. దేశ చరిత్రలో ఉగ్రవాదులపై జరిగిన అతిపెద్ద విజయం ఆపరేషన్ సింధూరేనని వ్యాఖ్యానించారు మోదీ. పాకిస్తాన్ సైన్యం ఎప్పుడూ ఊహించని ప్రాంతాల్లో దేశ సాయుధ దళాలు దాడులు జరిపాయని, ఉగ్రవాద శిబిరాలను నేలమట్టం చేశాయని చెప్పారు. ఉగ్రవాదుల సహాయంతో ప్రాక్సీ యుద్ధం అస్సలు ఆమోదయోగ్యం కాదనే విషయాన్ని ఆపరేషన్ సింధూర్ తెలియజేసిందని అన్నారు. ఇప్పుడు పాకిస్తాన్ భూభాగంలోనే ఆ దేశంపై దాడి చేయడానికీ వెనుకాడబోమని ప్రధాని హెచ్చరించారు. ఉగ్రవాదులకు సహాయం చేసే వారు కూడా భారీ మూల్యాన్ని చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. భారత్ పై కన్నెత్తి చూడటానికి ఉగ్రవాద సంస్థలు భయపడే స్థితికి వచ్చాయని చెప్పారు.

# కూటమికి జగన్ రిటర్న్ గిఫ్ట్

జూన్ 12 తో కూటమి ప్రభుత్వం కొలువు తీరి సంవత్సరం అవుతుంది. ఈ ఏడాది పాలన పైన ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని జగన్ అంచనాగా కనిపిస్తోంది.

హామీల అమలు లో వైఫల్యం రెడ్ బుక్ పేరుతో వరుస కేసులతో పాలన పూర్తిగా వదిలేసారని జగన్ ఆరోపిస్తున్నారు. పార్టీ నేతలు కేడర్ పైన కేసులతో రాజకీయ ప్రతీకారానికి దిగుతున్నారని జగన్ ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తున్నారు. అధికారంలో ఉన్న సమయంలో పార్టీ కార్యకర్తలకు అన్యాయం జరిగిందని ఈ సారి ఖచ్చితంగా కార్యకర్తలకే ప్రాధాన్యత ఉంటుందని జగన్ హామీ ఇస్తున్నారు. ఈ ఏడాది కాలంలో జగన్ పరామర్శలకు మాత్రమే జిల్లాలకు వెళ్లారు. ఇప్పుడు కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

### ప్రజల్లోనే ఉండేలా

జగన్ సంక్రాంతి నుంచే జనంలోకి వెళ్లాలని ప్రతీ పార్లమెంట్ పరిధిలో కార్యకర్తలతో రెండు రోజు ల పాటు సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. అయితే, ప్రభుత్వానికి ఏడాది సమయం కూడా ఇవ్వకుండా ప్రజల్లోకి వెళ్లటం సరి కాదనే అభిప్రాయం పార్టీ సీనియర్ల నుంచి వ్యక్తం అయింది. దీంతో, జగన్ జిల్లాల పర్యటనలు వాయిదా పడ్డాయి.

ఇక వరుసగా పార్టీ నేతల పైన కేసులు నమోదు అవుతున్న వేళ పార్టీ కేడర్ లో మనోధైర్యం నింపాల్సిన అవసరం పైన పార్టీ ముఖ్య నేతలతో జగన్ తాజాగా చర్చించారు. అదే సమయంలో ప్రభుత్వానికి ఏడాది సమయం పూర్తి కావటంతో ఇక ప్రజల్లోకి వెళ్లాలని జిల్లాల వారీగా పార్టీ కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించే లా నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు దాదాపు ముహూర్తం ఫిక్స్ చేసారు.

### కూటమి కంచుకోటల్లో

ఇక నుంచి జిల్లాల్లోనే ఉండటం ద్వారా ప్రభుత్వం పైన ఒత్తిడి పెంచాలని జగన్ భావిస్తున్నారు. కేసులు హామీల విస్మరణ గురించి నిలదీయాలని డిసైడ్ అయ్యారు. జూలై 8న వైఎస్సార్ జన్మదినం నాడు జగన్ జిల్లాల పర్యటన ప్రారంభించాలని సూత్ర ప్రాయంగా నిర్ణయించినట్లు పార్టీ నేతల సమాచారం. తొలి విడతలో కూటమి కంచుకోటల్లోనే జగన పర్యటన ఉండేలా షెడ్యూల్ సిద్ధం చేస్తున్నారు. అక్కడే తమ బలం చాటాలని భావిస్తున్నారు. అదే విధంగా ప్రతీ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల కార్యకర్తలతోనూ సమావేశం కానున్నారు. గోదావరి లేదా శ్రీకాకుళం జిల్లా నుంచి జగన్ పర్యటనలు ప్రారంభం కానున్నాయి. వచ్చే వారం పల్నాడు పర్యటన తరువాత జగన్ జిల్లాల పర్యటన పైన అధికారికంగా నిర్ణయం వెలువరించే అవకాశం ఉంది.

# రేషన్ దుకాణాల్లోనే సరుకులు

అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలోని పేద కుటుంబాలకు జూన్ 1వ తేదీ నుంచి రేషన్ దుకాణాల ద్వారానే నిత్యావసర సరుకులను అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఇకపై ప్రతినెలా ఒకటో తేదీ నుంచి పదిహేనో తేదీ వరకు చౌక ధరల దుకాణాలు ప్రజలకు అందుబాటులో ఉంటాయని ఆయన తెలిపారు. ఈ దుకాణాలు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు తెరిచి ఉంటాయని పవన్ వివరించారు.

గత ప్రభుత్వం పేదలకు రేషన్ సరుకులు అందించే చౌకధరల దుకాణాలను మూసివేసిందని పవన్ విమర్శించారు. "ఇంటింటికీ సరుకులు అందిస్తామని చెప్పి, రూ.1,600 కోట్లతో వాహనాలు కొనుగోలు చేశారు. అయితే, ఇంటింటికీ ఇవ్వడం మానేసి, నెలలో ఒకటి రెండు రోజులు మాత్రమే ప్రధాన కూడళ్లలో వాహనాలు నిలిపి సరుకులు పంపిణీ చేయడంతో ఎంతో మంది పేదలు ఇబ్బందులు పడ్డారు" అని ఆయన అన్నారు.

రేషన్ వాహనం ఎప్పుడు వస్తుందో తెలియక రోజువారీ పనులు మానుకోవాల్సి వచ్చిందని, చిరుద్యోగాలు చేసుకునేవారు సెలవులు పెట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మిగిలిన రేషన్ బియ్యం, ఇతర సరుకులను అక్రమంగా తరలిస్తున్న విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో విచారణ జరిపిందని పవన్ తెలిపారు. ఈ విచారణలో భాగంగా వేలాది టన్నుల అక్రమ బియ్యాన్ని కాకినాడ, విశాఖపట్నం ఓడరేవుల్లో పట్టుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఇటువంటి అక్రమాలను అరికట్టేందుకే, తిరిగి చౌకధరల దుకాణాల ద్వారానే పేదలకు నిత్యావసరాలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన స్పష్టం చేశారు. ఈ కొత్త విధానంలో భాగంగా, దివ్యాంగులు మరియు 65 ఏళ్లు పైబడిన వృద్ధులకు వారి ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందించే సౌకర్యాన్ని కూడా ప్రభుత్వం కల్పించిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. పేద ప్రజలకు సక్రమంగా, సకాలంలో నిత్యావసరాలు అందేలా చూడటమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఆయన పునరుద్ఘాటించారు.

# మిస్ వరల్డ్ విన్నర్‌గా
## "ఓపల్ సుచాతా చువాంగ్‌శ్రీ"

సుచాతకు రూ.8.5 కోట్ల ప్రైజ్ మనీ దక్కనుంది. థాయ్ లాండ్ లోని ఫుకెట్ అనే ప్రాంతంలో సుచాత జన్మించారు. మొత్తం 108 దేశాలకు చెందిన కంటెస్టెంట్ లు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఆమె తన 16 ఏళ్ల వయసులోనే క్యాన్సర్ ముప్పు నుంచి బయటపడినట్లు ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు సుచాత చువాంగ్.

అప్పటి నుంచి థాయి లాండ్ లో బ్రెస్ట్ క్యాన్సర్ పై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. మిస్ వరల్డ్-2025 పోటీల్లో చరిత్ర సృష్టించిన సుచాత చువాంగ్ శ్రీ కి ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఇక ఈ ఫైనల్ పోటీలకు సోనూ సూద్, సుధారెడ్డి, 2014 మిస్ ఇంగ్లండ్ కరీనా జడ్జిలుగా ఉన్నారు.

మిస్ వరల్డ్ జడ్జిల ప్యానెల్ హెడ్ గా మిస్ వరల్డ్ సంస్థ ఛైర్మన్ జూలియా మోర్లీ ఉన్నారు. ఇక మిస్ వరల్డ్ జడ్జిల ప్యానెల్ లో రానా దగ్గుబాటి,జయేశ్ రంజన్ కూడా ఉండటం విశేషం. ఇక సోనూసూద్ కు మిస్ వరల్డ్ హ్యుమానిటేరియన్ అవార్డు లభించింది. ఈ అవార్డును టాలీవుడ్ హీరో రానా దగ్గుబాటి సోనూసూద్ కు అందించారు.

# గోశాలల అభివృద్ధికి ప్రత్యేక కమిటీ

చేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. నిర్మించబోయే గోశాలలు కేవలం గోవులను ఇరుకు ప్రదేశాల్లో బంధించినట్లుగా ఉండరాదని, అవి స్వేచ్ఛగా తిరిగేందుకు వీలుగా, అన్ని రకాల అత్యాధునిక సదుపాయాలతో తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఇందుకోసం, ప్రతి గోశాలను కనీసం 50 ఎకరాల విశాలమైన స్థలంలో ఏర్పాటు చేసేలా అనువైన భూములను గుర్తించాలని ఆయన ఆదేశించారు. అంతేకాకుండా, ఈ గోశాలల సమర్థవంతమైన నిర్వహణ కోసం ధార్మిక సంస్థలు, సేవా సంఘాలను భాగస్వాములను చేసే అవకాశాలను కూడా పరిశీలించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

# కవిత వ్యవహారం "ఓ ఫ్యామిలీ డ్రామా"

చాలా మంది ఎమ్మెల్యేలు బీజేపీతో టచ్ లోకి వచ్చినప్పుడల్లా, కేసీఆర్ ఆ పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశమై బీజేపీతో పొత్తు పెట్టుకుంటామని, నాకు కేంద్ర మంత్రి పదవి ఇస్తారని మాయ మాటలు చెప్పి వాళ్లను బీజేపీలోకి వెళ్లకుండా చేసేవారని బండి సంజయ్ ఆరోపించారు.

### బీఆర్ఎస్‌తో కలిసే ప్రసక్తే లేదు

'బీఆర్ఎస్ అంటేనే కుటుంబ, అవినీతి పార్టీ. కవితను అరెస్ట్ చేయకుండా ఉండటానికి బీజేపీతో కలవడానికి బీఆర్ఎస్ ప్రయత్నించింది. ఈ అవినీతి, కుటుంబ పార్టీని మేం దగ్గరకు రానివ్వలేదు. కుటుంబ పార్టీలకు బీజేపీ దూరం. ఇవన్నీ తెలిసే ప్రజల దృష్టిని మళ్లించేందుకు కల్వకుంట్ల ఆర్ట్స్ ప్రొడక్షన్ లో కాంగ్రెస్ నిర్మాతగా, డైరెక్టర్ గా 'చార్ పత్తా' సినిమాను నడిపిస్తుందన్నారు. వాళ్లు ఎన్ని డ్రామాలాడినా బీఆర్ఎస్ ను దగ్గర తీసే ప్రసక్తే లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని, ప్రజలు తీవ్రమైన ఆగ్రహంతో ఉండటంతో వాళ్ల దృష్టిని మళ్లించేందుకు ఇటువంటి ఎత్తుగడలంటూ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 18 నెలలుగా టైంపాస్ పాలిటిక్స్ చేస్తోందన్నారు సంజయ్. ఆరు గ్యారంటీలపై చర్చ జరుగుతుంటే ఏదో ఒక అంశాన్ని తెరపైకి తీసుకొస్తున్నరని, బీఆర్ఎస్ సర్కార్ అవినీతి బయటపెట్టి కేసీఆర్ కుటుంబాన్ని జైలుకు పంపిస్తామన్నారు. కాళేశ్వరం, డ్రగ్స్, ఫోన్ ట్యాపింగ్, ఫాంహౌజ్, ఫార్ములా ఈ రేసు కేసుల విషయంలో కేసీఆర్, కేటీఆర్ లను అరెస్ట్ చేస్తామని చెప్పి మాట తప్పారు. కాంగ్రెస్ పై ప్రజలకు నమ్మకం పూర్తిగా పోయిందన్నారు.

వేములవాడ రాజన్న ఆలయ పరిధిలో 18 గోవులు చనిపోవడంపై అధికారులు వ్యవహరిస్తున్న తీరు సరిగా లేదని, గోవులను కూడా రక్షించకపోతే ఎట్లా? సరైన సౌకర్యాలు కల్పించి వాటిని కాపాడాల్సిన బాధ్యత వాళ్లపై లేదా? గోవుల సంఖ్యకు తగినట్లుగా తగిన సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవడం అధికారులు విఫలమైయ్యారని ఆరోపించారు. రాజన్న ఆలయంలో భక్తుల సంఖ్య పెరుగుతోంది. ఆదాయం కూడా పెరుగుతున్నందున భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించి, భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు దేశద్రోహ వ్యాఖ్యలేనని బండి సంజయ్ అన్నారు. భారత సైన్యం ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా సీఎం మాటలు ఉన్నాయని. పాకిస్తాన్ ఉగ్రవాదులను పెంచిపోషించేలా ఉన్నాయన్నారు. రాఫెల్ యుద్ధ విమానాలను వినియోగించింది భారత సైన్యం. వాటిని విమర్శించడమంటే భారత సైన్యంపై కాంగ్రెస్ కు నమ్మకం లేనట్లుగా భావించాల్సి ఉంటుందన్నారు. ఆర్మీ చీఫ్ పై విశ్వాసం లేదా? మాట్లాడితే ఇందిరాగాంధీ గురించి మాట్లాడతున్నారని, ఇందిరా హయాంలో యుద్ధం జరిగితే పాక్ ఆక్రమిత కాశ్మీర్ ను ఎందుకు స్వాధీనం చేసుకోలేకపోయిందని ప్రశ్నించారు. పాకిస్తాన్ ఉగ్రవాదులను ఎందుకు విడిచిపెట్టారని? కాశ్మీర్ లో రెండు జాతీయ జెండాలు, రెండు రాజ్యాంగాలకు అనుమతి ఇచ్చిందెవరు కాంగ్రెస్సే కదా అన్నారు సంజయ్. పుల్వామా దాడిలో భారత సైనికులను చంపితే పాకిస్తాన్ భూభాగంలోకి చొరబడి ఉగ్రవాదులను మట్టుబెట్టిన చరిత్ర భారత సైన్యానికి ఉందని, అమెరికాలో సెప్టెంబర్ 11 దాడుల్లో ట్విన్ టవర్స్ పై ఉగ్రవాదులు దాడి చేస్తే 10 ఏళ్లదాకా ఒసామా బిన్ లాడెన్ ను పట్టుకోలేకపోయింది. కానీ పెహల్గామ్ ఘటన జరిగిన 15 నిమిషాల్లోనే పాకిస్తాన్ భూభాగంలోకి చొచ్చుకపోయి ఉగ్రవాదులను, ఉగ్రవాద శిబిరాలను మట్టుపెట్టిన గొప్ప చరిత్ర భారత సైన్యానికి ఉందన్నారు బండి సంజయ్.

# ఎన్ని కూలాయన్నది కాదు, ఎందుకు కూలాయన్నదే ముఖ్యం

జనరల్ చౌహాన్ చెప్పారు. తద్వారా పాక్ తో జరిగిన సైనిక ఘర్షణలో భారత ఫైటర్ జెట్లు కూలిపోయిన విషయం నిజమేనని అంగీకరించినట్లైంది. అయితే, నాలుగు రోజుల పాటు జరిగిన ఘర్షణలో ఏ దశలోనూ అణు యుద్ధం అంచు వరకు వెళ్లలేదని జనరల్ చౌహాన్ స్పష్టం చేశారు. "యుద్ధ విమానం కూలిపోవడం ముఖ్యం కాదు, అవి ఎందుకు కూలిపోయాయన్నదే ముఖ్యం" అని ఫైటర్ జెట్ల నష్టంపై అడిగిన ప్రశ్నకు జనరల్ చౌహాన్ సమాధానమిచ్చారు. పాకిస్థాన్ ఆరు భారత యుద్ధ విమానాలను కూల్చివేసిందన్న వాదన "పూర్తిగా అవాస్తవం" అని ఆయన కొట్టిపారేశారు. అయితే, భారత్ ఎన్ని విమానాలను కోల్పోయిందనే కచ్చితమైన సంఖ్యను ఆయన వెల్లడించలేదు. "ఎన్ని అనేది ముఖ్యం కాదు. అవి ఎందుకు కూలిపోయాయి, ఎలాంటి పొరపాట్లు జరిగాయి అనేదే ముఖ్యం" అని ఆయన పునరుద్ఘాటించారు.

"మేము చేసిన వ్యూహాత్మక తప్పిదాన్ని అర్థం చేసుకోగలిగాం, దాన్ని సరిదిద్దుకున్నాం, రెండు రోజుల తర్వాత మా విమానాలన్నీ మళ్లీ సుదూర లక్ష్యాలపై దాడులు చేశాయి" అని జనరల్ చౌహాన్ తెలిపారు. మే 7న పాకిస్థాన్‌తో చెలరేగిన ఘర్షణల్లో భారత యుద్ధ విమానాల పరిస్థితిపై ఒక భారత ప్రభుత్వ లేదా సైనిక అధికారి ఇంత స్పష్టంగా మాట్లాడటం ఇదే తొలిసారి. చైనా, ఇతర దేశాల నుంచి పాకిస్థాన్ సేకరించిన ఆయుధాల ప్రభావం గురించి కూడా జనరల్ చౌహాన్ తక్కువ చేసి మాట్లాడారు. అవి "పనిచేయలేదని" అన్నారు. "మేము పాకిస్థాన్ భూభాగంలోకి 300 కిలోమీటర్ల దూరం వెళ్లి, భారీ వాయు రక్షణ ఉన్న వైమానిక స్థావరాలపై కచ్చితత్వంతో దాడులు చేయగలిగాం" అని భారత సైనిక చీఫ్ వివరించారు. ప్రస్తుతం కాల్పుల విరమణ కొనసాగుతోందని, భవిష్యత్తులో పాకిస్థాన్ చర్యలపై ఇది ఆధారపడి ఉంటుందని ఆయన తెలిపారు. "మేము స్పష్టమైన హద్దులు నిర్దేశించాం," అని జనరల్ చౌహాన్ స్పష్టం చేశారు.

## గ్రూప్ 1 పరీక్ష కేంద్రాన్ని

# తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్



**అనంతపురం :** అనంతపురంలో పలు పరీక్షా కేంద్రాల్లో ఏపీపీఎస్సీ నిర్వహిస్తున్న గ్రూప్-1 మెయిన్స్ పరీక్షా కేంద్రాలను మంగళవారం జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. అభ్యర్థులను క్షుణంగాక్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే పరీక్ష హాల్లో కుహాల్లోకి ఇవ్వాలని, ఇటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పకడ్బందీగాపక్కడబందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులు నుఅధికారులను ఆదేశించారు

## అక్రమంగా కర్ణాటకకు

# తరలిస్తున్న సబ్సిడీ బియ్యం పట్టివేత

**రాప్తాడు :** చెన్నై కొత్తపల్లి మండలంలోని ప్యాదిండి గ్రామంవద్ద మంగళవారం అక్రమంగా తరలిపోతున్న సబ్సిడీ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

మంగళవారం సికేపల్లి పోలీసులకు రాబడిన సమాచారం మేరకు ఎస్సై తోపాటు మరికొంతమంది పోలీసులు ప్యాడింది గ్రామం వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ధర్మవరం వైపు నుండి బులోరా వాహనం వెళ్తూ ఉండగా ఆపి పోలీసులు తనిఖీ చేశారు. అందులో 57 పాకెట్లు బియ్యం ఉన్నట్లు గుర్తించారు.

# అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తాం

**హిందూపురం :** కొండూరు గ్రామంలో మంగళవారం ఉదయం ఎస్ఐ నరేంద్ర ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానుతుల ఇళ్లను సోదా చేశారు. ట్రబుల్ మంగర్స్ రౌడీషీటర్ల ఇళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ తల్లితండ్రులు ఆడపిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మహిళలపై జరిగే అత్యాచారాలు పోలీసు చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. గ్రామంలో ఎటువంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా జీవించాలన్నారు.

## బేటి బచావో బేటి పడవో

# కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**కదిరి :** కదిరి నియోజకవర్గం గాండ్లపెంట మండల కేంద్రలోని హైస్కూల్ నందు కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం బేటి బచావో బేటి పడవో కార్యక్రమంలో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వేసవి ప్రత్యేక శిబిరాలను బాలికలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐసీడిఎస్ అధికారులు, సిబ్బంది, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు మౌలిక

# సదుపాయాలు కల్పించాలి

కదిరి, మే 6(ఎ.ఎం.ఎస్): ఉపాధి కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, పెండింగ్ లో ఉన్న ఉపాధి బిల్లులు చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బి. కదిరప్ప డిమాండ్ చేశారు. మంగళవారం నల్లచెరువు మండలం బొమ్మిరెడ్డి పల్లి గ్రామలోని పని ప్రదేశంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతూ మండల వ్యాప్తంగా గ్రామాలలో ఇప్పటికీ పనులు మొదలు పెట్టలేదని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రమణ, తదితరులు పాల్గొన్నారు.

## నూనెలోడ్ తో వెళ్తున్న

# ఈచర్ వాహనం బోల్తా

**పూతలపట్టు :** అతివేగంగా వస్తున్న లారీ బ్రేక్ వేయడంతో అదుపుతప్పి బోల్తా పడిన సంఘటన రాత్రి చోటుచేసుకుంది. వివరాలకు వస్తే, చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం కేంద్రంలోని తేనెపల్లి వద్ద నూనె తరలిస్తున్న వాహనం స్పీడ్ బ్రేకర్ వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో నూనె మొత్తం రోడ్డుపై పాలయింది. డ్రైవర్కు స్వల్ప గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాలి ఉంది.

# నూతన మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికైన సెల్వరాజ్

కుప్పం, మే 6(ఎ.ఎం.ఎస్): కుప్పం మున్సిపల్ చైర్మన్ నూతనంగా ఎన్నికైన సెల్వరాజ్ బుధవారం ప్రమాణస్వీకారం జరుగుతుందని మున్సిపల్ టీడీపీ అధ్యక్షులు రాజకుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, రాష్ట్ర ఏపీ ఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం, కుప్పం టీడీపీ నాయకులు పాల్గొంటరాని టీడీపీ నేతలు తెలిపారు.

# పూజలు అందుకున్న సుగుటూరు గంగమ్మ

చిత్తూరు, మే 6(ఎ.ఎం.ఎస్): చిత్తూరు జిల్లా పుంగనూరు పట్టణం 22వ వార్డు బెస్త వీధిలోని శ్రీ సుగుటూరు గంగమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయాన్నే అమ్మవారి శిలా విగ్రహానికి ఫల పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకించి అలంకరించారు. ఆ ప్రాంతవాసులు, గంగమ్మను దర్శించుకున్నారు. మహిళలు భక్తిశ్రద్ధలతో ఆలయంలో దీపాలను వెలిగించి అమ్మవారికి సమర్పించారు.

## మంత్రితో సమావేశమైన

# నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జ్



**పుంగనూరు :** రాష్ట్ర మంత్రి రాంప్రసాద్ రెడ్డి తో పుంగనూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జ్ చల్లా బాబు మంగళవారం రొంపిచర్లలో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గానికి చెందిన పలువురు తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు మంత్రిని కలిసి ఆయా మండలాలలోని రాజకీయ పరిస్థితుల గురించి తెలియజేశారు. అనంతరం మంత్రి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వంలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని తెలిపారు.

## పాలకొండ్రాయుడుకి ఇంజనీరింగ్

# కళాశాలలో ఘనంగా నివాళి




**రాజంపేట, :** శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల స్థాపనకు ప్రేరణగా నిలిచిన పాలకొండ రాయుడు మంగళవారం స్వర్గస్థులైన వార్త మమ్మల్ని తీవ్రంగా బాధించిందని కళాశాల చైర్మన్ సుబ్బయ్య తెలిపారు. కళాశాల అభివృద్ధికి అందించిన సేవలు చిరస్మరణీయమైనవి. ఆయన చూపిన మార్గాన్ని అనుసరిస్తూ యువతకు నాణ్యమైన విద్యను అందించేందుకు శ్రీ సాయి విద్యా సంస్థలు కట్టుబడి ఉన్నాయని కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డా. సుధాకర్ రెడ్డి అన్నారు.

## ఆర్టీసీ డ్రైవర్ మృతి పట్ల

# విచారం వ్యక్తం చేసినమంత్రి

**రాయచోటి :** అన్నమయ్య జిల్లా రాయచోటి ఆర్టీసీ డ్రైవర్ చంద్ర మృతి పట్ల రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి విచారణ వ్యక్తం చేశారు. ఆర్టీసీ డ్రైవర్ చంద్ర విధి నిర్వహణలో ఉండగా మంగళవారం గుండెపోటుకు గురై మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి చంద్ర కుటుంబానికి సంతాపం తెలిపారు. డ్రైవర్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

# కడప జెడ్పి సర్వసభ్య సమావేశం వాయిదా

**కడప :** ఉమ్మడి కడప జిల్లా జడ్పీ సర్వసభ్య సమావేశం వాయిదా పడినట్లు అధికారులు తెలిపారు. ఈనెల 8న జరగాలిసిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం 15వ తేదీకి వాయిదా వేసినట్లు జడ్పీ సీఈవో ఓబులమ్మ తెలిపారు. ఈనెల 8న ఏపీ క్యాబినెట్ భేటీ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఆమె చెప్పారు. జడ్పిటిసిలు ఈ విషయాన్ని గమనించి ఈనెల 15 వ తేదీన సమావేశానికి హాజరు కావాలని సీఈవో కోరారు.

## జిల్లాస్థాయి శిక్షణా తరగతులను

# జయప్రదం చేయండి

**రాజంపేట :** మదనపల్లిలో మే 10, 11వ తేదీన జరగనున్న ఏఐటీయూసీ జిల్లా స్థాయి శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి సికిందర్ కోరారు. మంగళవారం రాజంపేట ఏఐటీయూసీ కార్యాలయంలో శిక్షణా తరగతుల కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులను ఏఐటియుసిఏఐటీయూసీ నాయకులను సైద్ధాంతికంగా, రాజకీయంగా, మానసికంగా, ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు ఈ శిక్షణా తరగతులు దోహద పడతాయన్నారు.దోహదపడతాయన్నారు.

## కళారాధన ఉచిత

# లలిత కళల శిక్షణా శిబిరం ప్రారంభం



**నంద్యాల :** కళారాధన సాంస్కృతిక సంస్థ నంద్యాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత లలిత కళల, క్రీడల వేసవి శిక్షణా శిబిరాన్ని నంద్యాల కేఎన్ఎం పురపాలక పాఠశాల ఆవరణలో ప్రముఖ న్యాయవాది, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వెదుర్ల రామచంద్రరావు మంగళవారం జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు. కళారాధన అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు అధ్యక్షతన, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే గౌరు చరితని కలిసిన

# ముస్లిం మైనారిటీ నేతలు

**నందికొట్కూరు :** పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, నందికొట్కూరు టిడిపి ఇన్చార్జి శ్రీ గౌరు వెంకట రెడ్డిని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్లూరు ప్రాంతానికి చెందిన ప్రభుత్వ ఖాజీ ఇస్మాయిల్ మౌలానా మరియు ముస్లిం మైనారిటీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా సమావేశమై వారితో హర్షాతిరేకంగా మాట్లాడారు.

## కళారాధన రజతోత్సవ

# లోగో ఆవిష్కరించిన మంత్రి ఫరూక్

**నంద్యాల :** కళారాధన సాంస్కృతిక సంస్థ నంద్యాలలో 2000 సంవత్సరంలో ప్రారంభించబడి గత 25 సంవత్సరాలుగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నది. ఈ సందర్భంగా కళారాధన రజతోత్సవ వేడుకలలో భాగంగా సంవత్సరం పొడవునా భారీ రాష్ట్రస్థాయి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ రజతోత్సవ కార్యక్రమాల లోగోను రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఫరూక్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు.

# విగ్రహ కొన ప్రతిష్ట మహొూత్సవంలో పాల్గొన్న స్పీకర్



**నర్సీపట్నం :** నర్సీపట్నంలో మంగళవారం శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో నిర్వహించిన విగ్రహ-యంత్ర పునఃప్రతిష్ఠ మహొూత్సవంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తన సతీమణి పద్మావతితో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాగశాలలో విఘ్నేశ్వర పూజ, పుణ్యావచనం, మండప ఆరాధన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, పురోహితులు పూర్ణకుంభంతో స్పీకర్ దంపతులను ఆహ్వానించారు. మే 8వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

# భీమిలిలో టీడీపీ నేతలకు తప్పిన పెను ప్రమాదం

**భీమిలి :** టిడిపి నేతలకు పెను ప్రమాదం తప్పింది. మంగళవారం భీమిలి నియోజకవర్గం పరిధిలో గల పద్మనాభంలో యం. ఎస్ యం. ఈ శంకుస్థాపన సమయంలో స్టేజ్ కూలింది. ఆ సమయంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, గంటా శ్రీనివాసరావు, ఛైర్మన్ శివ శంకర్ స్టేజ్ పై ఉండగా చివర్లో స్టేజ్ కూలింది. అయితే ఎవరికి ఏటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

## పాఠశాల అదనపు భవనాలకు

# శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

**మాడుగుల :** మాడుగుల నియోజకవర్గ పరిధిలో గల కే. కోటపాడు మండలం కింతాడ పంచాయతీ గొల్లలపాలెం గ్రామంలో గల కేజీబీవీ పాఠశాలలో అదనపు భవనాలు నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ భవనాలు కోటి 64 లక్షల రూపాయలతో నిర్మించనున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. దీంతో విద్యార్థులకు వసతి సౌకర్యం మరింత మెరుగుపడగలదని చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే ఇంట తీవ్ర విషాదం

**కురుపాం :** మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజు ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది. మంగళవారం ఆయన సోదరుడు నిమ్మక విజయానంద్ (45)రోడ్డు(45) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన సొంతూరులో శుభాకార్యానికిశుభకార్యానికి వెళ్లి తిరిగి విధులకు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. తూడి గ్రామంలో అయనఆయన వీఆర్వోగా పనిచేస్తున్నరు.పనిచేస్తున్నారు. ఎంతో భవిష్యత్ ఉన్న విజయానంద్ ప్రాణాలు కోల్పోవడంతో అతని కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# సేంద్రియ ఉత్పత్తుల స్టాల్ ఏర్పాటు



**బొబ్బిలి :** కూరగాయ పంటల సాగుకు సేంద్రీయ ఎరువులను వినియోగించి, సాగుచేయడం వల్ల రైతులకు ఖర్చులు తగ్గి నాణ్యమైన ఉత్పత్తులు పొందవచ్చునని రామభద్రపురం వెలుగు ఏపీఎం అన్నపూర్ణ తెలిపారు. రామభద్రపురం మండల కేంద్రంలో గత రెండు రోజులు గారోజులుగా సేంద్రియ ఉత్పత్తుల స్టాల్ ఏర్పాటు చేశారు. మండల సమాఖ్య ఆధ్వర్యంలో ప్రతీ , మంగళవారం గ్రీవెన్స్ ఏర్పాటు చేసి దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని వెల్లడించారు.

# అలా చెంచిన వారికి మూడేళ్లు జైలు శిక్ష: జడ్జి

విజయనగరం, మే 6(ఎ.ఎం.ఎస్): బొబ్బిలి కోర్టు ఆవరణలో మంగళవారం మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి హేమస్రవంతి జానకీరామ్ మాట్లాడుతూ కార్మికులతో వేట్టిచాకిరి చేయించితే మూడేళ్ల జైలుశిక్ష పడుతుందన్నారు. కార్మిక చట్టాలు, వేతన సవరణ, హక్కులు, బాధ్యతలు గురించి వివరించారు. ఇళ్లల్లో కార్మికులతో వేట్టిచాకిరి చేయించితే మూడేళ్ల జైలుశిక్ష, జరిమానా పడుతుందన్నారు.

## గ్రామాలలో సీసీ కెమెరాలు

# ఏర్పాటు చేసే విధంగా చూడాలి



**కనిగిరి :** కనిగిరి పట్టణంలోని స్థానిక సీఐ కార్యాలయంలో మంగళవారం హనుమంతునిపాడు, పెద్ద చెర్లోపల్లి, కనిగిరి ఎస్సైలతో సీఐ ఖాజావలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో పోలీస్ స్టేషన్లో వదిన కేసులు వివరాలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ మండలాల్లో పల్లె నిద్ర నిర్వహించి గ్రామస్తులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా గ్రామస్తులకు తెలపాలన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**అద్దంకి :** కనిగిరి మున్సిపల్ పరిధిలోని కొత్తూరు వద్ద రెండు మోటార్ సైకిళ్లుఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వారిలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా వారిని కనిగిరి ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. ఆ వ్యక్తి ఒంగోలు బస్టాండ్ కు చెందిన అలీ(12)గా గుర్తించారు. మెరుగైన వైద్యం కోసం హుటాహుటిన ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

# సామాజిక సేవకు గౌరవ డాక్టరేట్

ఎచ్చెర్ల, మే 6(ఎ.ఎం.ఎస్): శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం కేశవరావుపేట ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు పారుపల్లి శ్రీనివాసరావుకు గౌరవ డాక్టరేట్ లభించింది. గడచిన 35 సంవత్సరాలుగా సామాజిక సేవా రంగంలో ఆయన అందిస్తున్న సేవలను గుర్తిస్తూ ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సహారా చారిటబుల్ ట్రస్ట్ ఈ పురస్కారాన్ని మంగళవారం ప్రకటించింది. ఈ మేరకు ట్రస్ట్ జాతీయ చైర్మన్ అఖిలేష్ అహ్మద్ గౌరవ డాక్టరేట్ ను శ్రీనివాసరావుకు అందజేశారు.

# శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ వద్ద ఏఐటీయూసీ డిమాండ్



**శ్రీకాకుళం :** ఉద్యోగ భద్రత కల్పించి, దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు టి. తిరుపతి రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శ్రీకాకుళం మున్సిపల్ కార్యాలయంలో బుధవారం పాఠశాల స్వీపర్లు, ఆయాలు, వాచ్‌మెన్‌ల సమస్యలు తరతరాలుగా పరిష్కారం కావడం లేదని, రూ. 4 వేల జీతంతో జీవనం దుర్భరంగా ఉందని అన్నారు. వెంటనే జీతం 21 వేలకు పెంచాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని అన్నారు.

## ఉప్పల్ ప్రెస్ క్లబ్ సీనియర్ జర్నలిస్టు మాదిరాజు సురేష్ గుండెపోటుతో కన్నుమూశారు



ఉప్పల్( ప్రశ్న న్యూస్) ఉప్పల్ ప్రెస్ క్లబ్ ప్రజా దర్బార్ సీనియర్ జర్నలిస్టు మాది రాజు సురేష్ గుండెపోటుతో కన్నుమూశారు. అకస్మాత్తుగా ఇంట్లో అస్వస్థతకు గురి కావడంతో కళ్ళు తిరిగి పడిపోవడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగానే సురేష్ చనిపోయాడని డాక్టర్లు తెలిపారు. సురేష్ అకాల మరణం బాధాకరమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. అంత్యక్రియల కోసం ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ తో ఎమ్మెల్యే పంపించిన ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నాను అని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఉప్పల్ ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు శ్రద్ధాంజలి ఘటించారు.

## వివాహేతర సంబంధం పెట్టుకున్న జంటకు దేహశుద్ధి



పెద్దపల్లి(ప్రశ్న న్యూస్) పెద్దపల్లి జిల్లా సుల్తానా బాద్ మండల కేంద్రంలోని అశోక్ నగర్ చెందిన మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్న వ్యక్తికి శనివారం స్థానికులు దేహశుద్ధి చేశారు. సుల్తానాబాద్ పట్టణంలో నివాసముండే మౌనిక అనే మహిళతో ఫేస్ బుక్ ద్వారా భూపాలపల్లికి చెందిన స్వామి అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం కాస్త ఇద్దరి మధ్య అక్రమ సంబంధంగా ఏర్పడింది, అయితే స్వామి అనే వ్యక్తి మూడు రోజులు గా మౌనిక ఇంట్లో ఉంటుండగా అది గమనించిన స్థానికులు ఇద్దరినీ రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొని వీధిలోనే స్తంభానికి తాడుతో కట్టి దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఇద్దరినీ అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు.

## ముగిసిన 26వ జాతీయ సబ్ జూనియర్ రోయింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు




సికింద్రాబాద్(ప్రశ్న న్యూస్) హుస్సేన్ సాగర్ లేక్ వేదికగా గత నాలుగు రోజుల నుండి జరుగుతున్న జాతీయ సబ్ జూనియర్ రోయింగ్ పోటీలు శనివారం ఘనంగా ముగిసాయి.




ముగింపు వేడుకలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి ఆసియన్ రోయింగ్ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు సిపి సింగ్ దేవ్ లు ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఏపీ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ఇస్తున్న ప్రభుత్వం లేక ఫెడరేషన్లు పలు జాతీయ అంతర్జాతీయ పోటీలకు హైదరాబాద్ ను వేదికగా ఎంపిక చేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ఆతిధ్యానికి చేస్తున్న ఏర్పాటులను జాతీయస్థాయిలో అభినందిస్తున్నారని ఆయన తెలిపారు. రోయింగ్ తో పాటు అనేక ఇతర వాటర్ స్పోర్ట్స్ కు తెలంగాణలో పుష్కలమైన అవకాశాలు ఉన్నాయని ఆయన తెలిపారు. రోయింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మాజీ అధ్యక్షులు ఆసియా ఫెడరేషన్ కల్నాల్ సి.పి సింగ్ దేవ్ మాట్లాడుతూ ఈ పోటీలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆతిథ్యం అభినందనీయమని ప్రభుత్వ ప్రోత్సాహంగా ఉంటే క్రీడల అభివృద్ధికి ప్రోత్సాహం ఎంతో అవసరం అని ఆయన అన్నారు. తెలంగాణ రోయింగ్ అసోసియేషన్ అధ్యక్షులు ఏపీ మిథున్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో హైదరాబాద్లోనే కాకుండా జిల్లాలలో విస్తరించేందుకు తెలంగాణ రోయింగ్ అసోసియేషన్ కృషి చేస్తుందని తెలిపారు. ఓవరాల్ చాంపియన్ గా నిలబడిన తెలంగాణతో పాటు ఇతర విజేతలకు బహుమతులు అందజేశారు ఈ కార్యక్రమంలో రోయింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు శ్రీమతి రాజ్యలక్ష్మి సింగ్ దేవ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు నవాబుద్దీన్, స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్లు చంద్రారెడ్డి రవీందర్ , అధికారులు కాలేరు సురేష్ కళ్యాణి, నందకిషోర్ గోకుల్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కొప్పుల నరసింహారెడ్డి అకాల మరణం బాధాకరం: పందిరి నాగిరెడ్డి

**హుజూర్‌నగర్ :** నాడు అకాల మరణం చెందిన మునగాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొప్పుల జైపాల్ రెడ్డి తండ్రి వెంకట నరసింహ రెడ్డి (విశ్రాంత ఉపాధ్యాయులు) అకాల మరణం వారి కుటుంబానికి తీరని లోటని కోదాడ నియోజక వర్గ కాంగ్రెస్ నాయకులు పందిరి నాగిరెడ్డి అన్నారు. శనివారం ఉదయం మునగాలలోని వారి స్వగృహంలో ఆయన పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. కోదాడ నియోజక వర్గ కాంగ్రెస్ నాయకులు పందిరి నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## బాన్సువాడ బంద్‌కు పిలుపునిచ్చిన హిందూ సంఘాలు

**బాన్సువాడ :** బాన్సువాడ పట్టణంలో పెద్ద హనుమాన్ మందిరంలో అన్ని కుల సంఘాలు సమావేశం నిర్వహించారు. హిందూ సంఘం ఆధ్వర్యంలో బంద్ కు పిలుపునిచ్చారు. మంగళవారం హిందూ సంఘాల ఆధ్వర్యంలో ప్రతి ఒక్క హిందువు వ్యాపారస్తులు వ్యాపారాలను మూసి ఉంచి హిందూ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బంధును విజయవంతం చేయాలని, స్వచ్ఛందంగా తమ వ్యాపారాలను బంద్ పెట్టాలని కోరారు.

## సమిష్టి కృష్టితో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేద్దాం



**ఎల్లారెడ్డి :** సమిష్టి కృష్టితో ఎల్లారెడ్డి మండలంలో కాంగ్రెస్ బలోపేతం కోసం కృషిచేద్దామని, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కురుమ సాయిబాబా అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు అఫిసులో గ్రామ కమిటీ అధ్యక్షులతో సమావేశం జరిగింది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ప్రతి కార్యకర్త పని చేయాలన్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు చేస్తే చర్యలుంటాయన్నారు.

## అనారోగ్య బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

కామారెడ్డి, : కామారెడ్డి నియోజకవర్గంలోని పలువురు అనారోగ్య బాధిత కుటుంబాలకు సోమవారం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను సీనియర్ కాంగ్రెస్ నేత, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు.

అనారోగ్య బారిన పడిన బాధితులు ఎవరైనా ఉంటే ఆస్పత్రికి సంబంధించిన ఒరిజినల్ బిల్లులతో సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు.

## ఆత్మహత్యే శరణ్య మంటూ రైతు ఆవేదన

**బాన్సువాడ :** మోస్రా మండల కేంద్రానికి చెందిన స్వామి గౌడ్ తన ఆవేదనను ఇలా వ్యక్త పరుస్తున్నాడు. మోస్రా శివారులో 952 సెర్వే నెంబర్ ధరణిలో తన భూమి ఫారెస్ట్ గేజిట్ లో ఉండటంతో అమ్మకం కావడం లేదని, వి ఆర్ ఓ పలు అధికారుల నుండి మొదలుకుని ఎమ్మెల్యే, మంత్రుల వరకు సమస్యను తీసుకుని 40 నెలలుగా తిరుగుతున్నా సమస్యకు పరిష్కారం దొరకడం లేదని సోమవారం ఆవేదన వ్యక్తం చేశారు. పరిష్కారం దొరకక పోతే ఆత్మహత్యే శరణ్యం అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు

## తెలంగాణ స్పైస్ కిచెన్‌ను పరిశీలించిన హైడ్రా కమిషనర్



**జూబ్లీహిల్స్ :** నగరంలోని జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 1లో ఆదివారం వేకువజామున పేలుడు జరిగిన తెలంగాణ స్పైస్ కిచెన్‌ను క్షేత్ర స్థాయిలో సోమవారం పరిశీలించిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్. పేలుడు దాటికి హెూటల్ వెనుక భాగంలో ఉన్న గది, ప్రహరీ కూలి రాళ్లు, ఇనుప రాడ్లు, రేకులు వందమీటర్ల వరకు ఎగరడంతో పేలుడు తీవ్రతను పరిశీలించి కారణాలను తెలుసుకున్న హైడ్రా కమిషనర్.

## టీజీపీఎస్సీ చైర్మన్ నియామానికి నోటిఫికేషన్ విడుదల

**వికారాబాద్ :** తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ నియామకానికి సోమవారం సాయంత్రం విడుదలైంది. నవంబర్ 20న సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకొనేందుకు అవకాశం కల్పించారు. అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. టీజీపీఎస్సీ ప్రస్తుత చైర్మన్ మహేందర్ రెడ్డి పదవీకాలం ఈ ఏడాది డిసెంబర్ 3వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో టీజీపీఎస్సీ నూతన చైర్మన్ కోసం ప్రభుత్వం కొత్తగా నోటిఫికేషన్ విడుదల చేసింది.

## రిషి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు, అన్నదానం

**ఎల్‌బినగర్ :** రిషి చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ఎల్బి నగర్ పరిధిలో పేదలకు దుప్పట్లు, అన్నదానా కార్యక్రమన్ని నిర్వహించారు. ట్రస్ట్ నిర్వాహకులు గత మూడు సంవత్సరాలనుండి రిషి పుట్టినరోజు సందర్భంగా పేదలకు సేవ చేయడం జరుగుతుంది అని తెలియ చేశారు. ఈ కార్యక్రమాన్ని ముందు ముందు పేదలకు చాలా పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తాం అని తెలియచేశారు.

## శ్రీవీరాంజనేయ స్వామి దేవాలయ పునప్రతిష్ట ఆహ్వానం



**షాద్‌నగర్ :** షాద్ నగర్ నియోజకవర్గం ఫరూఖ్ నగర్ శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయం పునర్నిర్మాణం, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలకు స్థానిక మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు, సీనియర్ జర్నలిస్ట్ కేపీ, రంగనాథ్ తదితరులను కమిటీ నిర్వాహకులు ఆహ్వానించారు. సోమవారం శ్రీ వీరాంజనేయ స్వామి కమిటీ కార్యనిర్వాహకులు పిల్లి శేఖర్, కుడుముల శివ, చెరుకు శివ, వీరేశం, అప్ప లక్ష్మి నరసింహ, యాదిరెడ్డి, మల్లేష్, తదితరులు కరపత్రాలతో ప్రముఖులను ఆహ్వానించారు.

## షాద్‌నగర్‌లో ఘనంగా దర్గా ఉర్సు ఉత్సవాలు

**రాజేంద్రనగర్ :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణం ఫరూక్ నగర్ లోని నాగులపల్లి రోడ్డులో ఉన్న అక్బరుద్దీన్ షా దర్గాలో సోమవారం ఉర్సు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఫరూక్ నగర్ జామే మస్జిద్ ఇమామ్ సయ్యద్ షాబుద్దీన్, సయ్యద్ అజరుద్దీన్ హాఫెజ్ ల ఆధ్వర్యంలో సయ్యద్ అక్బరుద్దీన్ షా ఖాద్రి ఉర్సు ఉత్సవాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తోపాటు కాంగ్రెస్ నాయకులు, హాజరయ్యారు.

## ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

**నాంపల్లి :** ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల నుండి స్వీకరించిన ఫిర్యాదులను పెండింగ్ లేకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయా భవనంలోని సమావేశమ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల వద్ద నుంచి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీతలతో కలిసి దరఖాస్తులను స్వీకరించారు.

## ఆలయాల అభివృద్ధికి నిరంతర కృషి

**అంబర్‌పేట** : ఆలయాల అభివృద్ధికి నిరంతర కృషి చేస్తున్నామని అంబర్ పేట్ కార్పొరేటర్ వినయ్ కుమార్ గౌడ్ అన్నారు. అంబర్ పేట్ డివిజన్ పరిధి ప్రేమ్ నగర్లోని శ్రీ ముత్యాలమ్మ, నల్ల పోచమ్మ ఆలయంలో 2025 క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వినయ్ కుమార్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమిష్టి కృషితో ఆలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని కోరారు.

## బాపూఘాట్ వద్ద సర్పంచుల నిరసన

**కార్వాన్:** రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచులు చేసిన పనులకు సంభందించిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. లాంగర్ హౌస్ లోని బాపూఘాట్ లో మహాత్మ గాంధీ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

## మన్మోహన్ సింగ్ చిత్రపటానికి డిప్యూటీ మేయర్ నివాళులు

సికింద్రాబాద్, నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డిలు దేశ మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మరణం పట్ల సంతాపం వ్యక్తం చేశారు. డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయంలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి, ప్రజాస్వామ్య పరిరక్షణకు అయన చేసిన సేవలను కొనియాడారు.

## పలు రాష్ట్రాల్లో జోరుగా వర్షాలు

దేశంలోని పలు రాష్ట్రాల్లో జోరుగా రెండు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. జమ్ముకశ్మీర్‌లోని రంబన్ ప్రాంతంలో భారీ వానాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా పడుతున్న వర్షాలకు వరద నీరు రోడ్లపై ఉప్పొంగుతుంది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. వాహనదారులు పలు ఇబ్బందులు ఎదురుకుంటున్నారు. శ్రీనగర్ లో కూడా భారీ వర్షాలకు కురుస్తున్నాయి. బలమైన ఈదురు గాలులు, వడగండ్ల వాన బీభత్సం సృష్టిస్తున్నాయి. అంతేకాకుండా అసోంలోని గౌహతిలో కూడా ఎడతెరిపి లేకుండా వానాలు పడుతున్నాయి. దీంతో భారీ వర్ష నీరు వీధుల్లోకి చేరి పోయింది. పలు కాలనీల్లో మోకాళ్ల లోతు నీరు వచ్చి చేరింది. ఆయా కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ వరద నీరుకు పలు ప్రాంతాల్లో రాకపోకలు స్తంభించాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరం చేసింది ఆ రాష్ట్ర ప్రభుత్వం. అదేవిధంగా రానున్న భారీ వర్షాలకు ఢిల్లీ ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంది. పది రోజుల క్రితం ఢిల్లీలో కురిసిన వర్షాలకు పలు ముఖ్యమైన నగరాల్లో భారీ స్థాయిలో ట్రాఫిక్ జాం ఏర్పడింది. దీంతో వాహనాదారులు గంటల కొద్ది రోడ్లపై వేచి ఉండాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో మరోసారి ఈ సమస్య తలెత్తకుండా ట్రాఫిక్ యంత్రాంగం వ్యూహారచన చేస్తోంది. నీటి ఎద్దటితో అధికంగా ప్రభావితమై ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రత్యేక సిబ్బందిని కేటాయించి కంట్రోల్ ద్వారా ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షంచనున్నారు.

## కేరళలో కొనసాగుతున్న భారీ వర్షాలు

తిరువనంతపురం : కేరళలో భారీ వర్షాలు కొనసాగుతున్నాయి. దీంతో రాష్ట్రంలో అన్ని నదులు ఉధృత స్థాయిలో ప్రహిస్తున్నాయి. ప్రజల్ని ప్రభుత్వం అప్రమత్తం చేసింది. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు అధికారులు తరలిస్తున్నారు. కాగా, రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) శుక్రవారం రెడ్ అలర్ట్ జారీ చేసింది. అతి భారీ వర్షాలు (24 గంటల్లో 20 సెం.మీ కంటే ఎక్కువ) కురిసే అవకాశం ఉంటే రెడ్ అలర్ట్ జారీ చేస్తారు. పతనంతిట్ట, అలప్పుజ, కొట్టాయం, ఎర్నాకుళం, ఇడుక్కి, త్రిస్సూర్, కన్నూర్, కాసరగోడ్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. మిగిలిన ఆరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ (భారీ నుంచి అతి భారీ వర్షాలు) జారీ చేసింది. మొత్తంగా 14 జిల్లాల్లోనూ శనివారం వరకూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. కనీసం జూన్ 3 వరకూ కేరళలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అలాగే, గత వారం రోజుల్లో కేరళలో 'అధిక వర్షపాతం' నమోదయిందని ఐఎండీ తెలిపింది. సాధారణంగా ప్రతీఏటా కేరళకు జూన్ 1వ వచ్చే నైరుతి రుతుపవనాలు ఈ సారి మే 24నే కేరళలో ప్రవేశించాయి. ఇదిలా ఉండగా, పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్ తీరాల్లో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం రాబోయే 12 గంటల్లో క్రమంగా బలహీనపడి, తదుపరి 24 గంటల్లో అల్పపీడనంగా మారే అవకాశం ఉందని శుక్రవారం మధ్యాహ్నం 1 గంటకు ఐఎండీ తెలిపింది.

కొప్పుల నరసింహారెడ్డి అకాల మరణం బాధాకరం: పందిరి నాగిరెడ్డి

హుజూర్‌నగర్ : నాడు అకాల మరణం చెందిన మునగాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొప్పుల జైపాల్ రెడ్డి తండ్రి వెంకట నరసింహ రెడ్డి (విశ్రాంత ఉపాధ్యాయులు) అకాల మరణం వారి కుటుంబానికి తీరని లోటని కోదాడ నియోజక వర్గ కాంగ్రెస్ నాయకులు పందిరి నాగిరెడ్డి అన్నారు. శనివారం ఉదయం మునగాలలోని వారి స్వగృహంలో ఆయన పార్థివ దేహానికి నివాళు లు అర్పించారు. కోదాడ నియోజక వర్గ కాంగ్రెస్ నాయకులు పందిరి నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమిష్టి కృష్టితో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేద్దాం

ఎల్లారెడ్డి : సమిష్టి కృష్టితో ఎల్లారెడ్డి మండలంలో కాంగ్రెస్ బలోపేతం కోసం కృషిచేద్దామని, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కురుమ సాయిబాబా అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు అఫిసులో గ్రామ కమిటీ అధ్యక్షులతో సమావేశం జరిగింది . రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ప్రతి కార్యకర్త పని చేయాలన్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు చేస్తే చర్యలుంటాయన్నారు.

# అన్ని అనుమతులున్నా కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారు

**శ్రీ రాగా స్కూల్ యాజమాన్యం : మల్లారపు వరప్రసాద్, కవిత**




కొత్తగూడెం (ప్రశ్న న్యూస్) స్థానిక మెదర బస్తి లోనీ శ్రీ రాగా స్కూల్ పై బీసీ సంఘ నాయకులు చేసిన ఆరోపణలు అన్ని అబద్ధాలే అంటూ శ్రీ రాగా స్కూల్ మెనేజ్మెంట్ వర ప్రసాద్ , కవిత ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీ రాగా స్కూల్ మాస్టర్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా నడుస్తుందని, ఈ సొసైటీ 2008లో రిజిస్ట్రేషన్ చేయించామని, రిజిస్ట్రేషన్ నెంబర్ 251 గా నమోదు అయ్యిందని, అంతేగాక శ్రీ రాగా స్కూల్ పెరుమీద 2010లో ప్రభుత్వ గుర్తింపు పొందామని ప్రభుత్వ గుర్తింపు నెంబర్ 5615/బి1/2010 గా ఉందని, మళ్ళీ 2020లో ప్రభుత్వ గుర్తింపును రెన్యువల్ చేశామని శ్రీ రాగా స్కూల్ కి 2030 వరకు ప్రభుత్వ పర్మిషన్ ఉందన్నారు. ఈ విషయాలన్నీ తెలుసుకోకుండా బీసీ సంఘం అధ్యక్షులు పామర్తి అంకినీడు ప్రసాద్ మాపై తప్పుడు ఆరోపణలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. అంతేకాక శ్రీ రాగా స్కూల్ బిల్డింగు వారిదే అని అంకినీడు ప్రసాద్ 10 సం..లు లీజు కి అగ్రిమెంట్ చేసి మళ్ళీ ఇప్పుడు వేరే వారికి సదరు బిల్డింగు ను 5 సం..లీజుకు ఇచ్చారని ఆరోపించారు. అందువల్ల అతనిపై సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకోబోతున్నట్టు తెలిపారు. బీసీ సంఘ అధ్యక్షులు వేరే కొందరు అతీతశక్తులతో కలిసి ఇటువంటి మోసాలు చేస్తున్నారని వారిపై చట్టపరమైన చర్యలు తప్పక తీసుకుంటామన్నారు. శ్రీ రాగా స్కూల్ కు అన్ని అనుమతులు, గుర్తింపులు ఉన్నాయని క్రొత్తగా అడ్మిషన్స్ తీసుకుంటున్నామని, విద్యార్థుల తల్లితండ్రులు ఇటువంటి అసత్య ప్రచారాలను నమ్మవద్దన్నారు...

# గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కి భాజపా ప్రభుత్వం కృషి

- కేంద్ర మంత్రి : బండి సంజయ్ కుమార్
- ప్రజా సంక్షేమార్ధం త్వరగా బిడ్జీ నిర్మాణం అయ్యేలా చర్యలు తీసుకుంటాం
- చొప్పదండి ఎమ్మెల్యే : డాక్టర్ మేడిపల్లి సత్యం
- వెంకట్రావుపల్లి - జగ్గారావుపల్లి గ్రామాలను కలుపుతున్న హై లెవల్ బ్రిడ్జీ కి శంకుస్థాపన



బోయినిపల్లి, (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, చొప్పదండి నియోజకవర్గం, బోయినిపల్లి మండలంలోని వెంకట్రావుపల్లి–జగ్గారావుపల్లి గ్రామాల మధ్య ప్రజల రవాణా సౌకర్యార్థం నిర్మించనున్న హై లెవల్ వంతెనకు శనివారం శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ, భాజపా జాతీయ కార్యదర్శి బండి సంజయ్ కుమార్, చొప్పదండి నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ మేడిపల్లి సత్యం పాల్గొన్నారు.

ఈ వంతెనను రూ.3.59 కోట్ల అంచనా వ్యయంతో, మొత్తం 5.47 కిలోమీటర్ల దూరంలో నిర్మించనున్నారు. ఈ బ్రిడ్జీ నిర్మాణం పూర్తి అయితే ఇరు గ్రామాల ప్రజలకు రవాణా సౌలభ్యం కలుగుతుందని, ఆర్థిక, సామాజిక అభివృద్ధికి దోహదపడుతుందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ, "గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధికి బీజేపీ ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఈ బ్రిడ్జ్ నిర్మాణం ప్రజలకు తక్షణ ప్రయోజనం కలిగించడమే కాకుండా భవిష్యత్తు తరాలకు ఉపయోగపడుతుంది," అని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, "ప్రజల అవసరాలపై దృష్టిపెట్టి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ఆమోదించింది. త్వరితగతిన నిర్మాణం పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటాం," అని తెలిపారు.ఈ కార్యక్రమంలో భాజపా, కాంగ్రెస్ పార్టీల శ్రేణులు, అధికారులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# కేంద్ర మంత్రి బండి సంజయ్ దంపతులకు శ్రీధర్ శుభాకాంక్షలు



వేములవాడ,(ప్రశ్న న్యూస్) కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, భాజపా జాతీయ కార్యదర్శి బండి సంజయ్ కుమార్ దంపతుల పెళ్లిరోజు వేడుకలను పురస్కరించుకొని శనివారం వేములవాడ పట్టణ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు డాక్టర్ రాపెల్లి శ్రీధర్ కరీంనగర్ లోని కేంద్ర మంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి లడ్డూ ప్రసాదం అందజేసి,శ్రీ రామచంద్రుని కలప ప్రతిమను అందజేసి, నిత్యం ప్రజా సేవలో నిమగ్నమవుతూ,దేశాభివృద్ధి కి పాటుపడడంలో భగవంతుడు వారి దంపతులకు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని,ఇలాంటి వివాహ వేడుకలు మరెన్నో జరుపుకోవాలని,మున్ముందు మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించి,బండి సంజయ్ దంపతులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

# మంచి మనస్సుకు సన్మానం, మడుపు శ్రీ హరికి వీడ్కోలు

- అతిరథ మహారథుడికి ఆత్మీయ వీడ్కోలు
- 35 ఏండ్లుగా అందరితో చిరుమందహాసంతో పలకరిస్తూ మనస్సును గెలిచిన వ్యక్తి శ్రీహరి
- నిన్న వీడ్కోలు కార్యక్రమంలో అందరూ ఆయన సేవలను గుర్తిస్తూ అధికారులు,సిబ్బంది కన్నీటిపర్యంతమయ్యారు.



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) ఆత్మీయ సత్కారం అనేది ఒక వ్యక్తిని గౌరవించడం,ప్రేమగా సన్మానం చేయడం.

సాధరణంగా ఒక వ్యక్తి చేసే సేవలు,ఆయన వ్యక్తిగత లక్షణాలను నలుగురికి తెలియజేసే విధంగాను అలాగే వారి జీవిత ప్రయాణంలో విజయాలను గుర్తించి ఆత్మీయ సత్కారం వేదికగా మారుతుంది.ప్రభుత్వంలో ఉన్న అరవై నాలుగు శాఖల్లో విధులు నిర్వహిస్తున్న ఉన్నతాధికారులు నుంచి సిబ్బంది వరకు పదవి విరమణ చేసేటప్పుడు వారి గొప్పతనాన్ని తెలియజేస్తారు. ఈ నేపథ్యంలో సికింద్రాబాద్ తిరుమలగిరి ట్రాన్స్పోర్ట్ కార్యాలయంలో గత ముప్పై ఐదేళ్ళ ట్రాన్స్పోర్ట్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న మడుపు శ్రీ హరికి నిన్న ఉద్యోగ పదవి విరమణ ఆత్మీయ సత్కారం కార్యక్రమం నిర్వహించారు. అతిరథ మహారథుడికి ఆత్మీయ వీడ్కోలు.35 సంవత్సరాలు సేవలందించిన సౌమ్యుడు శ్రీహరి అంటూ పొగడ్తలతో ముంచెత్తారు.ఆర్టీవో శాఖలో తనకంటూ వ్యక్తిగత గుర్తింపు తో అందరితో మన్ననలను పొందిన శ్రీహరి. తిరుమలగిరి ఆర్టీవో కార్యాలయంలో గత 35 సంవత్సరాలుగా ఎనలేని సేవలందించిన మడుపు శ్రీహరి పదవి విరమణ పొందారు. తనదైన శైలిలో అధికారుల వద్ద మెప్పు తెచ్చుకున్న శ్రీహరి వాహనదారులతో మాట్లాడుతూ ఆయన మాటలకు మంత్రముగ్ధులై ఎలాంటి సమస్యనైనా ఇట్టే పరిష్కరించే మనసున్న వ్యక్తిగా ముద్ర పడింది. అలాగే కార్యాలయంలో గాని ప్రజలు గాని ఏమైనా పని చెప్తే చాలు సరే అంటూ తన బాధ్యత అంటూ ఇట్టే పూర్తి చేసేస్తాడు. అలాంటి నిజాయితీ గల వ్యక్తి నిన్న పదవి విరమణ పొందుతున్న సమయంలో వాహనదారులు కూడా ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.ఈ నేపథ్యంలో నిన్నటితో ఆయన సేవలో ముగుస్తున్న తరుణంలో ఏర్పాటు చేసిన పదవీ విరమణ ఆత్మీయ సత్కార కార్యక్రమానికి హైదరాబాద్ జిల్లా ఆర్టీవో అధికారులు హాజరయ్యారు. ఆర్టీవోలో పనిచేసే చిన్న స్థాయి ఉద్యోగి నుండి కమిషనర్ వరకు తనదైన శైలిలో గుర్తింపు తెచ్చుకోవడంలో శ్రీహరి సఫలీకృతమయ్యాడని అధికారులు పేర్కొన్నారు. అలాగే సిబ్బంది మాట్లాడుతూ ఆయన చిరు మందహాసంతో అందరినీ పలకరించే తీరు సమస్యలను సకాలంలో పరిష్కరించే విధానం ఆయనుంచి నేర్చుకున్నట్లు తెలిపారు. నిజాయితీకి మారుపేరుగా శ్రీహరి పనిచేసిన తీరు అందరికీ ఆదర్శప్రాయమని అన్నారు. ఆర్టీవో తిరుమలగిరి అంటేనే ప్రథమంగా గుర్తుకు వచ్చే పేరు శ్రీహరి అని అతని సేవలను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకొని ఆయన లాగానే అందరూ నిధుల్లో ఉండాలని అప్పుడే అధికారులకి గొప్ప పేరు తీసుకురావాల్సిన బాధ్యత ఉందని గుర్తు చేశారు. ఈ సందర్భంలో భాగంగా గత మూడు దశాబ్దాలుగా 16 మంది ఆర్టీవో అధికారులకు సేవలందించిన కార్యాలయంగా పేరొందిన తిరుమలగిరి ఆర్టీవో కార్యాలయంలో ఆయన 35 సంవత్సరాలు సేవలు అందిస్తూ ఉన్న తీరును పదవి విరమణ పొందిన అధికారులు ప్రస్తుతం పదవిలో ఉన్న అధికారులు సైతం కొనియాడారు.ఈ కార్యక్రమంలో డిటిసీ అఫ్రీం సిద్దీఖీ, తిరుమల గిరి ఆర్టివో ఎర్ర స్వామి,ఎంవీఐలు జయచందర్,నర్సింహా స్వామి, అవినాష్ చౌహాన్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ లావణ్య, కార్యాలయ నిర్వహణ అధికారి వాణి, యాదమ్మ,ట్రాన్స్పోర్ట్ అసోసియేషన్ కానిస్టేబుల్ శ్రీనివాస్, అశోక్,అర్జున్ తదితరులు పాల్గొన్నారు.




# పదవీ విరమణ శుభాకాంక్షలు

**- మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ నిర్వహకులు : డాక్టర్ మధు మహేష్**



వేములవాడ, (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ పట్టణానికి చెందిన "మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్" తరపున, వేములవాడ రూరల్ ఎస్సై ,మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మారుతి కి హృదయపూర్వక పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ మధు మహేష్ వెల్లడించారు.ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ "మీ సేవల్ని గుర్తుచేసుకుంటూ, వేములవాడ రాజన్న ఆశీస్సులతో మీరు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండునూరేళ్లు జీవించాలని కోరుకుంటున్నాము.అని అన్నారు.మా ట్రస్ట్‌కు చెందిన 13 గ్రూపులలోని 5064 మంది సభ్యుల తరపున మరొకసారి మీకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తు జీవితం సమృద్ధిగా ఉండాలని ఆకాంక్షిస్తున్నామన్నారు.

# తెలంగాణ రజతోత్సవ వేడుకలకు తరలి వెళ్లిన కూకట్పల్లి జర్నలిస్టులు



కూకట్ పల్లి(ప్రశ్న న్యూస్) తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం రజతోత్సవ వేడుకలను పురస్కరించుకొని నగరంలోని జలవిహార్ లో నిర్వహించిన కార్యక్రమానికి కూకట్ పల్లి జోన్ నుంచి జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. కూకట్ పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నిమ్మల శ్రీనివాస్ , ప్రధాన కార్యదర్శి కోహీర్ నాగరాజ్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్కే దయాసాగర్ ల ఆధ్వర్యంలో కూకట్ పల్లి చిత్తరమ్మ ఆలయం నుంచి బస్సులో జలవిహార్ కుచేరుకున్నారు. "తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు "నినాదంతో గత 25 సంవత్సరాల క్రితం ఆవిర్భవించిన తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం స్వరాష్ట్ర సాధన ఆకాంక్షను నెరవేర్చడానికి సబ్బండ వర్గాలను, సకల జనులను, రాజకీయ పార్టీలను ప్రజాసంఘాలను ఏకతాటి పైకి తీసుకొచ్చిన ఘనత తెలంగాణ జర్నలిస్ట్ ఫోరంకే దక్కుతుందని కష్ట ప్రెసిడెంట్ నిమ్మల శ్రీనివాస్ , ఆర్కె దయాసాగర్ పేర్కొన్నారు. అక్షరాలను ఆయుధంగా మలిచి నాటి నుంచి తెలంగాణ కోసం పరితపించిన తెలంగాణ కలం యోధుడు అల్లం నారాయణ నేతృత్వంలో పురుడు పోసుకున్న తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం తెలంగాణ మనుగడ సాగించినంత కాలం తెలంగాణ మలిదశ ఉద్యమానికి తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం చేసిన తెలంగాణ అక్షర కలం కవాతు,అక్షర పోరు సువర్ణ అక్షరాలతో లిఖించబడి ఉంటుందని అన్నారు. ఇదే స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పాలకులపై ఒత్తిడి పెంచి పరిష్కరించేందుకు తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం నాటి ఉద్యమ తరహాలో పోరాడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సదా మహేష్, భాస్కర్ చారి, కైలాష్, తెల్ల హరికృష్ణ, మహేందర్ నాయక్, రహిమాన్, హరికుమార్, బలరాం, రాజు యాదవ్, షబ్బీర్, నరేష్ సిటీ టైమ్స్, నాగమణి, ప్రవీణ్, శ్రీనివాస్ రెడ్డి, శ్రావణ్, నాగరాజు, ఆర్కే పటేల్, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్ 23వ వార్డు ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు పట్టాలు పంపిణీ చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డు ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు పట్టాలు పంపిణీ చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆఫీసర్ కేతావత్ శ్రీనివాస్ నాయక్.ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ మాట్లాడుతూ మీరు ఏ పార్టీ వారైనా పరవాలేదు,మీరు అర్హులైతే చాలు సంక్షేమ పథకాలు మీ ఇంటికి ముంగటికి వస్తాయని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మొదటి విడతలో నిరుపేదలకు పార్టీలకు సంబంధం లేకుండా పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల పంపిణి చేయడం జరిగింది.రాని వారు ఎవ్వరు కూడా అధైర్య పడకండి,రెండో విడతలో అందరికి మళ్ళీ ఇందిరమ్మ ఇండ్లు వస్తాయని బడుగు బలహీన వర్గాలకు అండగా వుండే పార్టీ కాంగ్రెస్ పార్టీ ప్రతి పేదోనికి సొంతింటి కలను నేర వేర్చడమే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ నైజం

## ఇందిరమ్మ ఇల్లు లేని గ్రామం లేదు హనుమంతుని గుడి లేని ఊరు లేదు..

ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేసేది కాంగ్రెస్ పార్టీయేనని మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డులో 13 ఇందిరమ్మ ఇండ్ల మంజూరి లబ్ది దారులకు ప్రొసీడింగ్స్ పంపిణి చేసిన మేడ్చల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ ఆనందం వ్యక్తం చేసిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులుఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ కేతావత్ శ్రీనివాస్ నాయక్,మేడ్చల్ మున్సిపాలిటీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు లవంగు రాకేష్ వంజరి,మేడ్చల్ మున్సిపాలిటీ ఎన్ ఎస్ యూ ఐ అధ్యక్షులు గుండ శ్రీధర్ కురుమ,ఇందిరమ్మ కమిటీ సభ్యులు సింగిరెడ్డి బాగిరెడ్డి,ఒగ్గు మనోజ్ కురుమ,గుండ వెంకటేష్ కురుమ,యాంజాల శ్రీనాథ్ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# చలో వరంగల్ నినాదంలో నాచారం డివిజన్ నేతలు



**నాచారం (ప్రశ్న న్యూస్)** నాచారం డివిజన్ ఎమ్మార్పీఎస్ నాయకులు చలో వరంగల్ నినాదంతో పద్మశ్రీ గ్రహీత మందకృష్ణ మాదిగ ఘన స్వాగతం పలకడానికి బయలుదేరారు. మేడ్చల్ జిల్లా అధ్యక్షులు ప్రణయ్ ఆధ్వర్యంలో జిల్లా నుండి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కొరపాక అంజి మాదిగ, బొడ్డు శివ, ఎలా సంతోష్ కుమార్, కిషన్, నరసింహ, మేడిపల్లి మండల అధ్యక్షులు బండారి సాయి,మరియు అభిమానులు భారీ ఎత్తున కార్యక్రమాన్ని ఘనవిజయం చేయడానికి బయలుదేరామని అన్నారు అరుదైన గౌర పురస్కారం రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డుని తీసుకున్న మొట్టమొదటిసారి వరంగల్ జిల్లాకు వస్తున్న దళిత బిడ్డను మందకృష్ణ మాది కి ఘన స్వాగతం పలకడానికి తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలు నుండి భారీ ఎత్తున ఎమ్మార్పీఎస్ నాయకులు స్వాగతం పలకడానికి విచ్చేస్తారని 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం ప్రతిఫలమే నేడు భారతదేశం గుర్తించే స్థాయికి హక్కులకై పోరాటం చేస్తున్న గొప్ప నాయకుడని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు.



# కీర్తి సురేష్ తెలివైన నిర్ణయం

మహానటితో ఎంతో గొప్ప పేరు తెచ్చుకున్నా హిట్ల కన్నా ఎక్కువ ఫ్లాపులతో ప్రయాణం చేస్తున్న కీర్తి సురేష్ కు పెళ్ళయాక కూడా ఆఫర్లు బాగానే వస్తున్నాయి. బాలీవుడ్ డెబ్యూ బేబీ జాన్ తీవ్రంగా నిరాశపరిచినా రాజ్ కుమార్ రావుతో సెక్టార్ 36లో ఛాన్స్ రావడం గురించి బాలీవుడ్ మీడియా ప్రత్యేకంగా ప్రస్తావిస్తోంది. విద్యా వ్యవస్థపై తీవ్ర విమర్శనాస్త్రంగా రూపొందబోయే ఈ సినిమాకు ఆదిత్య నింబాల్కర్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇందులో హీరోయిన్ పాత్ర ఎక్కువ పెర్ఫార్మన్స్ డిమాండ్ చేస్తుందట. అందుకే ఏరికోరి మరీ కీర్తి సురేష్ ని తీసుకున్నట్టు లేటెస్ట్ అప్డేట్. అయితే మన మ్యాటర్ దాని గురించి కాదు లెండి. ఇటీవలే సూర్య హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో ప్యాన్ ఇండియా మూవీ మొదలైన సంగతి తెలిసిందే. సూర్యకు జోడిగా మమిత బైజుని తీసుకున్నారు. నిజానికి మొదటి ఛాయస్ గా కీర్తి సురేష్ ని అడిగారట. కానీ తను అప్పటికీ విజయ్ దేవరకొండ – రవికిరణ్ కోలా కాంబోతో దిల్ రాజు నిర్మాణంలో తెరకెక్కబోయే రౌడీ జనార్ధనా కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఏదో ఒకటి మాత్రమే ఎంచుకునే పరిస్థితి వచ్చిందట. కీర్తి సురేష్ ఆల్రెడీ సూర్యతో గ్యాంగ్ చేసింది. మహానటిలో విజయ్ దేవరకొండ క్యామియో చేశాడు కానీ ఇద్దరి మధ్య కాంబినేషన్ సీన్లు లేవు. ఈ కారణంగా రౌడీ జనార్ధనా వైపు మొగ్గు చూపినట్టు అర్థమవుతోంది. అందరు స్టార్ హీరోలతో నటించాలన్న టార్గెట్ పెట్టుకున్న కీర్తి సురేష్ దానికి అనుగుణంగానే ప్లాన్ చేసుకుంటోంది. గతంలో చిరంజీవి చెల్లెలిగా భోళా శంకర్ ఆఫర్ ని సాయిపల్లవి తిరస్కరిస్తే దాన్ని కీర్తి సురేష్ అందిపుచ్చుకుంది. రజనీకాంత్ చెల్లెలిగా పెద్దన్నలో పోటీ పడి నటించింది. వీటి ఫలితాలు నిరాశపరిచినా తెలుగు తమిళ సీనియర్ స్టార్లతో నటించిన సంతృప్తి మిగిలింది.

# కన్నప్ప హార్డ్ డిస్క్ ఘటన విష్ణు చెప్పిన ట్విస్టులు



ఇటీవలే కన్నప్ప హార్డ్ డిస్క్ మాయమయ్యిందంటూ వచ్చిన వార్త ఇటు ఇండస్ట్రీ వర్గాల్లో, అటు సోషల్ మీడియాలో సెన్సేషనల్ టాపిక్ అయ్యింది. అంత పెద్ద ప్యాన్ ఇండియా మూవీకి సంబంధించిన కంటెంట్ కొరియర్ లో పంపడం ఏమిటంటూ ఫ్యాన్స్ షాక్ తిన్నారు. అయితే దీనికి సంబంధించిన వివరణ అడిగేందుకు మంచు విష్ణు టాలీవుడ్ మీడియాకు అందుబాటులోకి రాలేదు. ఇవాళ చెన్నైలో జరిగిన ఈవెంట్ లో కొన్ని ముఖ్యమైన విషయాలు పంచుకున్నాడు. ఫ్యామిలీ సంగతులు వద్దంటూ అసలు హార్డ్ డిస్క్ చోరీ వెనుక ఏం జరిగింది, ఎవరెవరు ఉండొచ్చనే కోణం ఎక్స్ ప్లయిన్ చేశాడు. ఆ సారాంశం చూద్దాం. కన్నప్ప డిజిటల్ వెర్షన్ మూడు కాపీలను హాలీవుడ్ స్టూడియోలో, మరో రెండు హైదరాబాద్ లో భద్రపరిచారు. స్థానికంగా ఉన్న కాపీలు ఒకటి డిఐ టెక్నీషియన్, మరొకటి ఆఫీస్ కోసం పంపుతారు. సేఫ్టీ బ్యాకప్ చేసుకోవడం అందరూ చేసేదే. కన్నప్ప వివిఎక్స్ మొత్తం ఎనిమిది కంపెనీలు చూస్తున్నాయి. విదేశాల్లో రెండు ఉండగా హైదరాబాద్, ముంబై, చెన్నై కలిపి మూడున్నాయి. డిస్క్ పోయిన వార్త విష్ణు ద్వారా బయటికి రాలేదు. పోలీస్ కంప్లయింట్ ఇచ్చాక అక్కడి నుంచి రిపోర్టర్ కు వేరే మార్గంలో సమాచారం అందింది. మాములుగా ముంబైలో పూర్తయిన వర్క్ ని ప్రసాద్ ల్యాబ్స్ లో డౌన్లోడ్ చేసుకుని చూసుకోవచ్చు. కానీ ఓసారి ఇబ్బంది ఎదురు కావడంతో ముంబై కంపెనీ ఆ సన్నివేశాలను ఒక డిస్క్ లో పొందుపరిచి కొరియర్ చేసింది. మాములుగా వీటికి రెండు అడ్రెస్ ఇస్తారు. ఒకటి ఆఫీస్, మరొకటి మోహన్ బాబు ఇల్లు. 15 సంవత్సరాలుగా ఇదే ఫాలో అవుతున్నారు.

# సినిమా కథ నచ్చింది కాని అదే నచ్చలేదు..



గత కొద్ది రోజులుగా దీపికా పదుకొణే పేరు నెట్టింట మారుమ్రోగిపోతుంది. అందుకు కారణం ఆమె స్పిరిట్ మూవీ నుండి తప్పుకోవడం. ఎప్పుడైతే దీపిక ఈ ప్రాజెక్ట్ నుండి తప్పుకుందో వెంటనే తన సినిమా హీరోయిన్ తృప్తి డిమ్రీ అని సందీప్ రెడ్డి వంగా ప్రకటించారు. ఆ తర్వాత దీపికా విషయంలో బాగా హర్ట్ అయిన సందీప్ తన సోషల్ మీడియా వేదికగా కొన్ని కామెంట్స్ చేశారు. ఈ నేపథ్యంలో దీపికా తన సోషల్ మీడియాలో మహిళలపై వివక్ష గురించి వీడియో షేర్ చేసింది. దీపిక పోస్ట్ చేసిన వీడియోను తమన్నా భాటియా లైక్ చేసి మద్దతు తెలిపారు. దీంతో ఈ ఇష్యూ చర్చనీయాంశం అయింది. ఇక దీపిక స్పిరిట్ నుండి తప్పుకోవడానికి పలు కారణాలు కూడా నెట్టింట వైరల్ అయ్యాయి. సినిమా కోసం రోజుకు ఆరు గంటల కంటే ఎక్కువ షూటింగ్ చేయనని దీపిక స్పష్టం చేసిందని, ఈ విషయంలోనే దర్శకుడు సందీప్‌రెడ్డి వంగాకి కోపం వచ్చి దీపికాని తప్పించినట్టు ప్రచారం జరిగింది. అంతేకాదు షూటింగ్ 100 రోజులకు మించితే, అదనపు రోజులకు అదనపు పారితోషికం ఇవ్వాలని దీపిక డిమాండ్ చేసినట్లు నెట్టింట ప్రచారం జరిగింది. ఈ షరతులు సందీప్ రెడ్డి వంగాకు ఇబ్బంది కలిగించాయని అన్నారు. అయితే తాజాగా దీపిక ఓ ఇంటర్వ్యూలో స్పిరిట్ నుండి తప్పుకోవడానికి గల కారణం చెప్పుకొచ్చింది. రీసెంట్‌గా ఓ డైరెక్టర్ నన్ను కలిసి కథ చెప్పాడు. కథ చాలా బాగా నచ్చింది. కాని మనీ గురించి చర్చ వచ్చినప్పుడు ఇంత చార్జ్ చేస్తా అని అన్నాను. దానికి వారు ఒప్పుకోలేదు. అందుకే నేను వారికి టాటా బైబై చెప్పాను. నా ట్రాక్ రికార్డ్ నాకు తెలుసు. అందుకే ఆ సినిమాకి నేను ఒప్పుకోలేదని దీపిక స్పష్టం చేసింది. అయితే ఇప్పుడు ఈ అమ్మడు అట్లీ– అల్లు అర్జున్ సినిమాలో కథానాయికగా ఎంపికైనట్టు సమాచారం. దీపిక ఈ మధ్య కల్కి చిత్రంతో తెలుగు ప్రేక్షకులని పలకరించిన విషయం తెలిసిందే.

# భిన్న పాయింట్‌తో ‘యముడు’



జగన్నాథ పిక్చర్స్ పతాకంపై జగదీష్ ఆమంచి హీరోగా నటిస్తూ, స్వీయ దర్శకత్వం వహించిన చిత్రం ‘యముడు’. ‘ధర్మో రక్షతి రక్షితః’ అనేది ఉప శీర్షిక. ఈ చిత్రంలో శ్రావణి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్ అందరిలో క్యూరియాసిటీని పెంచేసింది. తాజాగా ఈ చిత్ర టీజర్‌ను హీరో నవీన్ చంద్ర రిలీజ్ చేశారు. ఇదొక మైథలాజికల్, సస్పెన్స్, క్రైమ్, థ్రిల్లర్ మూవీ అని టీజర్ చూస్తే అర్థం అవుతుంది. సిటీలో ఉన్న అమ్మాయిలు మిస్ అవుతుండటం, నాటకాల్లో యముడు వేషం వేసే వ్యక్తికి ఈ హత్యలకు సంబంధం ఉందేమో అన్నట్టుగా టీజర్‌ను కట్ చేశారు. యముడు భూలోకంకి వచ్చి నరకంలో విధించే శిక్షలన్నీ ఇక్కడే విధిస్తాడేమో అన్నట్టుగా కనిపిస్తోంది. ‘ధర్మంతు సాక్షాత్ భగవత్ ప్రణీతం’ అనే డైలాగ్ చూస్తుంటే, ఈ సినిమా హిందూ ధర్మాన్ని ఆధారంగా చేసుకుని కొత్త దృక్పథాన్ని చూపించబోతుందన్న ఆసక్తి కలుగుతుంది. హిందు ధర్మం నుంచి ఓ కొత్త పాయింట్‌తో ఆసక్తికరంగా సినిమాను మలిచినట్టు అనిపిస్తుంది. టీజర్‌లో విష్ణు రెడ్డి వంగా కెమెరా వర్క్, భవాని రాకేష్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ మరింత ప్రభావవంతంగా ఉంది అని చిత్ర యూనిట్ తెలిపింది.

# త్వరలో భారీ సినిమా ప్రారంభం



ప్రస్తుతం టాలీవుడ్ ప్రపంచ స్థాయికి ఎదిగిన సంగతి తెలిసిందే. తెలుగు చిత్ర సీమ నుంచి సినిమాలు వస్తున్నాయంటే అందరిలోనూ మంచి అంచనాలు ఉంటున్నాయి. ఆ అంచనాలను మరింత రెట్టింపు చేసేందుకు టాలీవుడ్‌లోకి ఓ కొత్త ప్రొడక్షన్ కంపెనీ అడుగుపెడుతోంది. ఇటీవల సోమో ఐరానిక్ ఆర్ట్ క్రియేషన్స్ బ్యానర్ లోగోని ఘనంగా లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ‘సోమో ఐరానిక్ ఆర్ట్ క్రియేషన్స్’ బ్యానర్ అధినేత జేజే మాట్లాడుతూ, ‘టాలీవుడ్‌లోకి నిర్మాతగా వస్తుండటం ఆనందంగా ఉంది. మాలాంటి కొత్త వారిని టాలీవుడ్ ఎంతో ఘనంగా స్వాగతిస్తోంది. ఇక్కడి పెద్దలు మాకు ఎంతో గైడెన్స్ ఇచ్చారు. ఫిల్మ్ ఛాంబర్‌లో మా సంస్థను రిజిస్టర్ చేశాం. మాకు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నుంచి కూడా సహకారం లభించింది. మా సంస్థ లోగోలో చూపించినట్టుగా ఆ వెలుగుని అంతటా పంచాలని ఆశిస్తున్నాం. పరిశ్రమలో పరస్పర సహకారం, ఎదుగుదల అనే కాన్సెప్ట్‌తో ఆ లోగోను డిజైన్ చేయించాం. ఇక్కడ మేం కొత్త వారిని ఎంకరేజ్ చేయడానికి, కొత్త కథల్ని తెరపైకి తీసుకురావడానికి ప్రయత్నిస్తాం. మా బ్యానర్‌పై త్వరలో ఒక భారీ సినిమా ప్రారంభం కానుంది. భవిష్యత్తులో ఎన్నో మంచి చిత్రాలను నిర్మించాలన్నదే మా లక్ష్యం’ అని తెలిపారు.

## రీరిలీజ్‌లో సరికొత్త
# రికార్డ్ క్రియేట్ చేసిన ఖలేజా..



ఈ మధ్య రీరిలీజ్ ట్రెండ్ ఎక్కువగా నడుస్తుండడం మనం చూస్తూనే ఉన్నాం. ప్రత్యేక సందర్భాన్ని పునస్కరించుకొని పలువురు హీరోల చిత్రాలు రీరిలీజ్ అవుతున్నాయి. ఇక సూపర్ స్టార్ మహేష్ బాబు కెరీర్ లో ఆల్ టైం క్లాసిక్ మూవీగా నిలిచిన ఖలేజా చిత్రం ఇటీవల రీరిలీజ్ కాగా, ఈ మూవీకి మంచి రెస్పాన్స్ వస్తుంది. ఖలేజా మూవీని రీ రిలీజ్ చేయాలని ఎప్పటి నుంచో ఆడియన్స్, ఫ్యాన్స్ మేకర్స్ ను కోరుతున్న నేపథ్యంలో సూపర్ స్టార్ కృష్ణ బర్త్ డే సందర్భంగా.. వరల్డ్ వైడ్ గా గ్రాండ్ గా రీ రిలీజ్ చేశారు. దీంతో రెస్పాన్స్ ఊహించిన రెస్పాన్స్ వస్తుంది. థియేటర్‌లో ఓ రేంజ్‌లో సందడి నెలకొంది. ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ అయిన అన్నీ సెంటర్స్ లో ప్రేక్షకులు, అభిమానులు బ్రహ్మరథం పడుతున్నారు. సినిమా వసూళ్ల పరంగా చూస్తే.. పెద్ద సంచలనం సృష్టించేలా ఉంది.. కచ్చితంగా రూ. 10 కోట్లను రాబడుతుందని ట్రేడ్ పండితులు అంచనాల వేయగా, అది నిజమయ్యేలా కనిపిస్తుంది. తొలి రోజే ఈ చిత్రానికి రూ. 6.5లక్షల కలెక్షన్స్ వచ్చాయని అంటున్నారు. ఇండియా మొత్తంలో 1531 షోలు (గురువారం రాత్రిం శుక్రవారం) పడగా.. రూ. 6.50 కోట్లు వసూలైనట్లు తెలుస్తోంది. అదే సమయంలో నార్త్ అమెరికాలో 72 వేల డాలర్లు ఖలేజా వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇప్పుడు $100K మార్క్ వైపు దూసుకుపోతుంది. అక్కడ గబ్బర్ సింగ్ రికార్డును బ్రేక్ చేసింది ఖలేజా. అప్పుడు గబ్బర్ సింగ్ $66,000 వసూలు చేయగా.. ఇప్పుడు అంతకు మించి వసూళ్లు రాబడుతుంది. రీ రిలీజ్ ట్రెండ్ లో బిజినెస్ మ్యాన్, మురారి, గబ్బర్ సింగ్ తర్వాత రూ. 5 కోట్లకుపైగా ఓపెనింగ్స్ సాధించిన చిత్రంగా ఖలేజా నిలవడం విశేషం. ఇక మహేష్ బాబు ప్రస్తుతం రాజమౌళి దర్శకత్వంలో భారీ బడ్జెట్ చిత్రం చేస్తున్నాడు. ఈ చిత్రంతో మహేష్ బాబు క్రేజ్ హాలీవుడ్‌కి చేరుకుంటుందని అంటున్నారు. ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతుంది.

# సరికొత్తగా ‘పోలీస్ కంప్లెయింట్’




భిన్న పాత్రలు, వైవిధ్యమైన చిత్రాలతో వరలక్ష్మి శరత్ కుమార్ తనకంటూ ఓ ప్రత్యేకతను చాటుకున్నారు. తాజాగా తెలుగులో ‘పోలీస్ కంప్లెయింట్’ చిత్రంతో ఆమె ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. సూపర్‌స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా ఈ చిత్రంలోని వరలక్ష్మి శరత్ కుమార్ ఫస్ట్‌లుక్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఈ సినిమాలో పవర్‌ఫుల్ క్యారెక్టరైజేషన్‌తో పాటు, తొలిసారి ఆద్యంతం వినోదాన్ని అందించే పాత్రలో ఆమె నటించడం విశేషం. ఈ చిత్రాన్ని ఎమ్మెస్కె ప్రమిద శ్రీ ఫిలిమ్స్, శ్రీ విష్ణు గ్లోబల్ మీడియా సంస్థల సంయుక్త బ్యానర్లలో సింగపూర్ బాలకృష్ణ, మల్లెల ప్రభాకర్ సంయుక్తంగా నిర్మిస్తుండగా, దర్శకుడు సంజీవ్ మేగోటి తెరకెక్కిస్తున్నారు. నవీన్ చంద్ర, కృష్ణ సాయి, రాగిణి ద్వివేది, రవిశంకర్, ఆదిత్య ఓం, అమిత్, దిల్ రమేష్, రాజశ్రీ నాయర్, సింగపూర్ బాలకృష్ణ, దుగ్గిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీహర్ష కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు సంజీవ్ మేగోటి మాట్లాడుతూ.. ‘చైన్ రియాక్షన్ ఆఫ్ కర్మ’ అనే కాన్సెప్ట్ ఆధారంగా తెరకెక్కి స్తున్నాం. మనం చేసే ప్రతి చర్యకి ఫలితంగా అదే తిరిగి మనకే వస్తుందని కాన్సెప్ట్‌తో, హర్రర్ థ్రిల్లర్ నేపథ్యంగా సరి కొత్తగా చూపించే ప్రయత్నం చేస్తున్నాం. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది’ అని చెప్పారు. ‘వరలక్ష్మి శరత్ కుమార్ పోషిస్తున్న పాత్ర సినిమాకే హైలెట్‌గా నిలుస్తుంది. అలాగే ఈ మూవీలో సూపర్ స్టార్ కృష్ణ మీద చేసిన స్పెషల్ సాంగ్ అందరికీ గుర్తుండిపోయేలా ఉంటుంది. ఈ సినిమాను భారీగా రూపొందిస్తున్నాం. యాక్షన్, హర్రర్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ మేళవించి ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతిని అందించేలా దర్శకుడు సంజీవ్ మేగోటి అత్యద్భుతంగా తెరకెక్కిస్తున్నారు’ అని నిర్మాతలు సింగపూర్ బాలకృష్ణ, మల్లెల ప్రభాకర్ తెలిపారు.

## రాజన్న ఆలయ ఉద్యోగులకు ఘన వీడ్కోలు



బోయినిపల్లి,(ప్రశ్న న్యూస్) వేములవాడ రాజన్న ఆలయంలో పర్యవేక్షకులుగా విధులు నిర్వహించిన వరి నరసయ్య, సుప్రభాత గాయకులుగా మధు శ్రీనివాస్, ఎలక్ట్రిక్ హెల్పర్‌గా విధులు నిర్వహించిన గుండ అంజయ్యలు పదవీ విరమణ పొందిన సందర్భంగా,శనివారం ఆలయ ఓపెన్ స్లాబ్ వద్ద ఆలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కూరగాయల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పురాణం వంశీ మోహన్ పాల్గొని పదవీవిరమణ పొందిన ఉద్యోగులను శాలువాలతో ఘనంగా సత్కరించి, ఆలయానికి వారు అందించిన సేవలను కొనియాడగా, మిగతా ఉద్యోగులు కూడా ఘనంగా వీడ్కోలు పలికారు.

## వేములవాడ గోశాల ఆకస్మిక తనిఖీ

**-వైద్య సేవలు అందించాలని కలెక్టర్ అదేశాలు జారీ**





వేములవాడ,(ప్రశ్న న్యూస్) వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి గోశాలలో ఇటీవల కోడెలు మరణించిన ఘటనలపై స్పందించిన రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శనివారం గోశాలను ఆకస్మికంగా సందర్శించి పరిస్థితిని సమీక్షించారు.ఈ సందర్భంగా అనారోగ్యంతో బాధపడుతున్న కోడెలకు మెరుగైన చికిత్స అందించేందుకు వెటర్నరీ వైద్యుల బృందాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.అనంతరం విశ్వహిందూ పరిషత్ నాయకులు ఉట్నూరి రాధాకృష్ణ రెడ్డి గోశాలలో ఉన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గోశాలకు పూర్తిస్థాయి పశువైద్యాధికారి నియామకం, సిబ్బందికి బయోమెట్రిక్ హాజరు విధానం, సీసీ కెమెరాల ఏర్పాటు, ఇతర వసతుల కల్పన వంటి అంశాలపై వివరించారు.ఈ కార్యక్రమంలో చేపూరి అశోక్, గడప కిషోర్ రావు, గౌరిశెట్టి శ్రీనివాస్, గుంటుకు పురుషోత్తం తదితరులు పాల్గొని కలెక్టర్‌తో కలిసి గోశాలను పరిశీలించారు.

## ఆర్ఎంపీ నిర్లక్ష్య వైద్యం వల్ల మహిళ మృతి

**- చికిత్స కేంద్రాన్ని సీజ్ చేసిన వైద్య ఆరోగ్యశాఖ**



కోనరావుపేట,(ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, కోనరావుపేట మండలం, కనగర్తి గ్రామంలో ఆర్ఎంపీ లక్ష్మీనారాయణ నిర్లక్ష్యంగా వైద్యం అందించడంతో వంగపల్లి గ్రామానికి చెందిన మహిళ రేణుక ఇంజక్షన్ వికటించి మృతి చెందిన ఘటన కలకలం రేపింది.ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ ఆదేశాలతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చర్యలకు దిగారు.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత ఆధ్వర్యంలో, సంబంధిత ఆర్ఎంపీపై కేసు నమోదు చేయడంతో పాటు ఆయన ప్రథమ చికిత్స కేంద్రాన్ని సీజ్ చేశారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ఆర్ఎంపీలు సూదులు,సెలైన్లు ఇవ్వకుండా కేవలం ప్రాథమిక చికిత్స మాత్రమే అందించాలని, మెడికల్ కౌన్సిల్ నియమ నిబంధనలు స్పష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్సిడి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రామకృష్ణ,మండల వైద్యాధికారి డాక్టర్ వేణుమాధవ్,కోనరావుపేట ఏఎస్ఐ,పోలీస్ సిబ్బంది, డిప్యూటీ డెమో రాజకుమార్, రషీద్, మహేష్ గౌడ్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## చెట్లు నరికారు..!

## తీయడం మర్చిపోయారు!!

**- ఇబ్బందులు పడుతున్న మహాలక్ష్మి వీధి నివాసితులు**

**- భాజపా యువమోర్చా లీగల్ సెల్ కన్వీనర్ : రేగుల రాజ్ కుమార్ డిమాండ్**





వేములవాడ,(ప్రశ్న న్యూస్) వేములవాడ పట్టణంలోని మహాలక్ష్మి వీధిలో ప్రజలు తీవ్ర అసౌకర్యాలు ఎదుర్కొంటున్నారు. స్థానిక అమ్మవారి ఆలయానికి తూర్పు భాగంలోని రోడ్డుపై విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను సెస్ అధికారులు నరికి రోడ్డుపై పడేయగా, ఇప్పటికే రెండు రోజులు గడుస్తున్నా వాటిని తొలగించలేదు.ఈ పరిస్థితిపై భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్,న్యాయవాది రేగుల రాజ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. “చెట్ల కొమ్మలు రోడ్డును పూర్తిగా ఆక్రమించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అడ్డంకులు ఏర్పడుతున్నాయి. కాలనీవాసులు ప్రమాదాలను ఎదుర్కొంటున్నారు. కానీ సంబంధిత అధికారులు ఇంతవరకూ స్పందించకపోవడం దురదృష్టకరం” అని ఆయన విమర్శించారు. ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా తక్షణమే చెట్ల కొమ్మలను తొలగించి, శుభ్రత చర్యలు చేపట్టాలని రాజ్ కుమార్ డిమాండ్ చేశారు.

## పదవీ విరమణ పొందిన

# పోలీసు అధికారులకు ఘనంగా వీడ్కోలు

**- వేములవాడ రూరల్ ఎస్సై మారుతి,హెడ్ కానిస్టేబుల్ రాజమౌళి లకు ఘనంగా వీడ్కోలు**

**- వీడ్కోలు సమావేశంలో జిల్లా ఎస్పీ స్ఫూర్తిదాయక సందేశం**





వేములవాడ,(ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం వేములవాడ రూరల్ సబ్ ఇన్స్పెక్టర్ మారుతి, కోనరావుపేట పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్‌గా సేవలందించిన రాజమౌళి లకు ఘనంగా వీడ్కోలు పలికారు.పోలీసు శాఖలో నాలుగు దశాబ్దాలకు పైగా విధులు నిర్వహించిన వీరి సేవలను రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ప్రశంసించారు. శాలువాలు కప్పి,పూలమాలలు వేసి, జ్ఞాపికలను అందజేసి వీరికి జిల్లా పోలీస్ శాఖ తరపున ఘనంగా సత్కారం చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ, “సుదీర్ఘకాలం ప్రజల కోసం చేసిన సేవలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకం. కుటుంబ సభ్యుల సహకారం వల్లే పోలీసులు కఠినమైన విధులను సమర్థంగా నిర్వహించగలుగుతారు” అని తెలిపారు. పదవీ విరమణ అనంతరం అధికారులకు లభించాల్సిన ప్రయోజనాలను త్వరితగతిన అందజేయాలని సంబంధిత శాఖలకు సూచించారు.అలాగే, పదవీ విరమణ పొందిన అధికారులు ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో కుటుంబంతో గడపాలని ఆకాంక్షించారు.ప్రజలకు అవసరమయ్యే సమయంలో పోలీసు వ్యవస్థ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రి రెడ్డి,అదనపు ఎస్పీ చంద్రయ్య,డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి తదితర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం

# తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది

**- వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్: ఆది శ్రీనివాస్**

**- తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ప్రభుత్వ విప్**




వేములవాడ,(ప్రశ్న న్యూస్) తెలంగాణ గల్ఫ్ సమితి ఖతార్ ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు దోహాలోని వేదికపై వందలాది మంది ప్రవాసులు, కార్మికుల మధ్య అత్యంత ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఖతార్ లేబర్ మినిస్టర్ ఖలీద్ మొహమ్మద్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ శ్రీనివాస్ మాట్లాడుతూ, “తెలంగాణ గల్ఫ్ సమితి కుల, మత బేధాలు లేకుండా సమాజాన్ని ఏకం చేస్తూ, తెలంగాణ సాంస్కృతిక విలువలను ప్రపంచానికి చాటి చెప్పేలా విశేష సేవలు అందిస్తోంది. ఇది గర్వకారణం,” అని పేర్కొన్నారు. ప్రవాస గల్ఫ్ కార్మికుల సంక్షేమం,సమస్యల పరిష్కారానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అన్ని విధాలుగా ఆదుకోవడానికి సిద్ధంగా ఉందని ఆయన హామీ ఇచ్చారు. లేబర్ మినిస్టరీ ప్రతినిధి ఖలీద్ మొహమ్మద్ కూడా గల్ఫ్ సమితి చేస్తున్న సేవలను ప్రశంసించారు. ఈ వేడుకల్లో టీపీసీసీ ఎన్ఆర్ఐ గల్ఫ్ అధ్యక్షులు, గల్ఫ్ అడ్వైజరీ కమిటీ సభ్యులు, గల్ఫ్ బోర్డు ప్రతినిధులు, ఎస్సీబీఎఫ్, ఐసీసీ,ఇతర తెలుగు సంఘాల నాయకులు పాల్గొన్నారు. ప్రముఖులు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, గుగ్గిళ్ల రవి గౌడ్, శ్రీ శానవాజ్, కోదూరి శివప్రసాద్, బాబు రాజన్న, సుందరగిరి శంకర్ గౌడ్, రషీద్ మహమ్మద్, దీపక్ శెట్టి, జాఫర్, అమర్ సింగ్, నందిని అబ్బ గౌని, వెంకప్ప, దీపక్ చుక్కల, సోమరాజు తదితరులు హాజరయ్యారు. తెలంగాణ గల్ఫ్ సమితి కార్యవర్గ సభ్యులు సంధ్యారాణి, ఎల్లయ్య బండపెల్లి, వెంకటేష్, మనోహర్, ప్రీతిష్, రజిత రెడ్డి, రాకేష్, ప్రసాద్

## గోశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



వేములవాడ( ప్రశ్న న్యూస్) తిప్పాపూర్ గోశాలనుకలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనారోగ్యంతో ఉన్న గోవులకు అందిస్తున్న చికిత్స, గోవులు సేద తీరేందుకు కల్పిస్తున్న సౌకర్యాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షెడ్ లను తొలగించి, పరిసరాలను శుభ్రం చేసి, మట్టి పోసి రోలర్ తో చదును చేయించాలని ఆదేశించారు. గోవుల సంరక్షణ కోసం చేపడుతున్న పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. తనిఖీలో ఆలయ ఈఓ వినోద్ రెడ్డి, మున్సిపల్ కమీషనర్ అన్వేష్, పశుసంవర్ధక శాఖ వైద్యులు డా.అంజిరెడ్డి, తదితరులు ఉన్నారు.

## అంకమ్మ తల్లి దేవాలయానికి రు. లక్ష విరాళం



## అందజేసిన దొంతుల నరేష్ కుమార్

సుజాతనగర్ (ప్రశ్న న్యూస్) మండలంలోని రాఘవపురం గ్రామంలో భక్తుల కొంగు బంగారమై విరాజిల్లుతున్న అంకమ్మ తల్లి దేవాలయ అభివృద్ధికి దొంతుల చిన్ననాగయ్య కుమారుడు దొంతుల నరేష్ కుమార్ లక్ష రూపాయలను దేవాలయ కమిటీ పెద్దలకు అందజేశారు. ఆ దేవాలయ అభివృద్ధిలో భాగంగా దేవాలయ చుట్టుప్రక్కల ఇనుప గ్రిల్స్ తయారు చేపిస్తామని ఆలయ పూజారి జనార్ధన శర్మ తెలిపారు. దొంతుల నరేష్ కుమార్ ఆలయనికి విరాళం ప్రకటించడంతో గ్రామస్తులు

## జూన్ 3 నుంచి అన్ని గ్రామాల్లో

# రెవెన్యూ సదస్సులు

**జూన్ 03 వ తేదీ నుంచి 20 వ తేదీ వరకు**

**ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**ఆర్డీవోలు, తహసీల్దార్లు, డీటీలు, ఆర్ఐలతో సమీక్ష సమావేశం**



సిరిసిల్ల( ప్రశ్న న్యూస్) వచ్చేనెల జూన్ 3వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జిల్లాలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. వచ్చేనెల మూడో తేదీ నుంచి నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులపై జిల్లాలోని ఆర్డీవోలు, అన్ని మండలాల తహసీల్దార్లు, డీటీలు, ఆర్ఐలతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సదస్సుల నిర్వహణ, అప్లికేషన్లు తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ.. భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని గ్రామాల్లో వచ్చే నెలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రతి మండలంలో నిర్వహించే సదస్సులపై రెండు రోజుల ముందుగా ఆయా గ్రామాలకు సమాచారం ఇవ్వాలని, అప్లికేషన్ తో పాటు ఇవ్వాల్సిన పత్రాలపై సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రతి గ్రామంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సదస్సులు నిర్వహించాలని తెలిపారు. సదస్సులు నిర్వహించే చోట హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయాలని, అప్లికేషన్ ఫారాలు ఇతర కావాల్సిన సామగ్రిని అందుబాటులో ముందస్తుగా సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. అప్లికేషన్ పూర్తిగా పక్కా సమాచారంతో నింపాలని తెలిపారు. ఆ వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ భూముల పరిరక్షించాలని స్పష్టం చేశారు. భూములకు సంబంధించి వచ్చే అప్లికేషన్ వివరాలు ఒక రిజిస్టర్ ఏర్పాటు చేసి దానిలో నమోదు చేయాలని పేర్కొన్నారు. అప్లికేషన్ లు ప్రతి అంశం చక్కగా రాయాలని అప్లికేషన్ స్వీకరించిన తర్వాత దరఖాస్తుదారులకు రిసీవ్డ్ కాఫీ అందజేయాలని, వారి కోసం ప్రత్యేకంగా సిబ్బంది నియమించి రాయించాలని సూచించారు. అందరూ సమన్వయంతో పనిచేసే సదస్సులను విజయవంతం చేయాలని సూచించారు. ప్రతి మండలంలో రెండు టీములు ఏర్పాటు చేయాలని ఒక టీముకు తహసిల్దార్, మరొక టీంకు డిప్యూటీ తాసిల్దార్ నేతృత్వం వహించాలని సూచించారు. ఆయా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు సదస్సులకు వచ్చే ముందు తమ భూమికి సంబంధించిన పత్రాలను వెంట తీసుకెళ్లాలని కలెక్టర్ చూపించారు. కార్యక్రమంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్థలం కబ్జా

- పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు
- ఫిర్యాదులందినా చర్యలు చేపట్టని డిప్యూటీ కమిషనర్
- అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ స్థలాలు కబ్జా






**నాచారం (ప్రశ్న న్యూస్)** ప్రభుత్వ స్థలం కనబడితే చాలు కబ్జా చేసి తీరుతామంటూ కబ్జాదారులు తిష్ట వేసుకొని కూర్చున్నారు. ఎక్కడ ప్రభుత్వ స్థలాలు కనబడిన కబ్జా చేయడం సర్వసాధారణంగా మారుతుంది. ప్రభుత్వ స్థలాలు యదేచ్ఛగా కబ్జా అవుతున్న అధికార యంత్రాంగం మాత్రం స్పందించకపోవడంతో కబ్జాల పర్వం యదేచ్ఛగా కొనసాగుతోంది. నాచారం పాత గ్రామంలో జిహెచ్ఎంసికి చెందిన విలువైన స్థలం కబ్జాకు గురి అయింది. నాచారం విలేజ్ నుంచి బాబానగర్ కి వెళ్ళే "రహదారి పక్కన జిహెచ్ఎంసికి చెందిన ఖాళీ స్థలంలో ప్రహరీగోడ, గేటును నిర్మించి కబ్జా చేశారు. దాదాపు కోటి రూపాయల వరకు విలువ చేసే 60 గజాల జిహెచ్ఎంసి స్థలాన్ని పక్కనున్న గృహ యజమాని ఇటీవల ఆక్రమించి ప్రహరీని నిర్మించాడు.ఈస్థలం గ్రామ పంచాయితీ హయాంలో కుక్కలమడిగా పిలువబడేది. ఆ సమయంలోనే ఇందులో గ్రామస్తుల కోసం టాయిలెట్లు నిర్మించారు. అప్పట్లో ఊరంతా ఈ టాయిలెట్లనే ఉపయోగించుకునేవారు ఆతర్వాత ప్రభుత్వం అంతటా టాయిలెట్లను తొలగించినట్లుగానే ఇక్కడ కూడా తొలగించింది. తొలుతఈ ఖాళీ స్థలం గ్రామ పంచాయితీ ఆధీనంలో ఉంది. ఆతర్వాత కాప్రా మునిసిపాలిటీ పరిధిలోకి, అనంతరం జిహెచ్ఎంసి అధీనంలోకి వచ్చింది. విలువైన ఈ ఖాళీ స్థలాన్ని ఎవరైనా కబ్జా చేస్తారని జిహెచ్ఎంసి అధికారులు బోర్డును ఏర్పాటు చేశారు. ఈస్థలంలో సీనియర్ సిటిజెన్స్ భవనం నిర్మించాలని ఎప్పటినుంచో నాచారం సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రజా దర్బారులో ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో ఇటీవల ఈఖాళీ స్థలానికి పక్కనున్న గృహయజమాని ఈ స్థలంలో కొంత భాగాన్ని ఆక్రమించి ప్రహరీగోడను నిర్మించి గేటును ఏర్పాటు చేయడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ ప్రతినిధులు, స్థానికులు జిహెచ్ఎంసి కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దానికి మొక్కుబడిగా స్పందించిన కాప్రా సర్కిల్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది ప్రహరీగోడ నిర్మాణం వద్ద నుంచి గంపలు, పారలు తీసుకెళ్లారే తప్ప ప్రహరీ గోడ నిర్మాణాన్ని అడ్డుకొని తొలగించకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారుల కనుసైగలోనే ప్రభుత్వ స్థలం కబ్జా అవుతుందా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. తాము ఎమ్మెల్యేను అడిగే ప్రహరీ
నిర్మించామని మరొకవైపు కబ్జాదారుడు ప్రచారం చేయడం విస్మయాన్ని కలిగిస్తోంది.

అత్యంత విలువైన జిహెచ్ఎంసి స్థలం కబ్జా అవుతున్నా కాప్రా టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోకపోవడం పట్ల స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జిహెచ్ఎంసి ఉన్నతాధికారులు, విజిలెన్సు విభాగం స్పందించి చర్యలు చేపట్టాలని, జిహెచ్ఎంసి స్థలాన్ని కాపాడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. కాప్రా సర్కిల్ అధికారుల బాధ్యతారాహిత్యం పై జోనల్ కమిషనర్ జిహెచ్ఎంసి కమిషనర్ స్పందించి కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## బుసు బుస్సుమని బుసలు కొట్టిన నాగరాజు

# ఏసీబీ రాకతో జెర్రీపోతుల జడుసుకుండు

- నాగరాజు అనుకున్నారందరూ కట్టలకు ఆశపడే కట్లపాము అని తెలియడంతో వలవేసి పట్టుకున్నారు
- లంచం తీసుకుంటూ అనిశా అధికారులకు పట్టుబడిన సర్వేయర్
- 2 నెలలుగా హారిగోస పెడుతుండు: రైతు మల్లేషం







సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) చంద్రంపేట గ్రామంలో జరుగుతున్న సర్వేయర్ల సమావేశంలో పాల్గొన్న ఎల్లారెడ్డిపేట మండల సర్వేయర్ నాగరాజుకు వెంకటాపూర్ గ్రామానికి చెందిన జక్కాపురం మల్లేశం ఫోన్ చేశాడు. సర్వేయర్ల సమావేశంలో నుండి బయటకు వచ్చిన సర్వేయర్ నాగరాజు 15,000 వేల రూపాయలను టక్కున తీసుకొని చాటుకున్న జేబులో వేసుకున్నాడు. మిగతా డబ్బులు ఏవి, ఎప్పుడు ఇస్తావ్ అంటూ బుసు బుస్సున ఒంటి కాలు మీద లేచిన నాగరాజును అవినీతి నిరోధక శాఖ అధికారులు చుట్టూ ముట్టారు. బుసు బుస్సుమని బుసలు కొట్టిన నాగరాజు అనిశా అధికారులని తెలియడంతో జెర్రీపోతుల జడుసుకుండు. నాకు పిల్లలు ఉన్నారంటూ రూధిస్తూ వదిలివేయాలని వేడుకున్నాడు. నాగరాజు అనుకున్నారందరూ కట్టలకు ఆశపడే కట్లపాము అని తెలియడంతో ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు. నాగరాజుని పట్టుకుని చేతులు కడిగించడంతో లంచం తీసుకున్న నాగరాజు చేతులు గులాబీ రంగులోకి మారిపోయాయి. లంచం తీసుకుంటూ పట్టుబడ్డ సర్వేయర్ నాగరాజును ఎల్లారెడ్డిపేట తహశీల్దార్ కార్యాలయానికి తీసుకువచ్చి విచ్చరించారు అవినీతి నిరోధక శాఖ అధికారులు.

### 2 నెలలుగా హరిగోస పెడుతుండు: రైతు మల్లేషం

వెంకటాపూర్ గ్రామానికి చెందిన జక్కాపురం మల్లేశం తనకు తన చిన్నమ్మకు కలిసి 6 గుంటల భూమి సర్వేనెంబర్ 476 ఈ, జిలో ఉందని, రాజకీయ పలుకుబడితో కబ్జా చేయడానికి యత్నిస్తున్నారని సర్వేయర్ కు హద్దులు చూపమని మొరపెట్టుకున్నాడు. కొలతలు చేసిన సర్వేర్ నాగరాజు దాపలవారీగా 21 వేల రూపాయలను తీసుకున్నాడు. లక్ష రూపాయలు ఇవ్వమని వేధించగా, 80 వేల రూపాయలకు ఒప్పందం కుదిరించుకున్నాడు. సర్వేర్ నాగరాజు చేస్తున్న వేధింపులను భరించలేక అవినీతి నిరోధక శాఖ అధికారులను సంప్రదించాడు జక్కాపురం మల్లేశం. వారి సూచనల మేరకు 15వేల రూపాయలు తీసుకొని వెళ్లి నాగరాజును కలిశాడు. మాటువేసి ఉన్న అనిశా అధికారులు వలవేసి పట్టుకున్నారు. అవినీతి అధికారిని పట్టుకోవడంతో సంతోషం వ్యక్తం చేశాడు జక్కపురం మల్లేశం. 2 నెలలుగా గోస పెడుతూ చుట్టూ తిప్పుకుంటున్నాడని ఆవేదన వ్యక్తం చేశాడు. అవినీతి నిరుద్యోగక శాఖ అధికారులు స్పందించిన తీరుకు మల్లేశం సంతోషం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలిపాడు.

### లంచం అడిగితే అనిశా అధికారులను సంప్రదించండి: రమణామూర్తి, ఏసీబీ డీఎస్పీ

సర్వేయర్ నాగరాజు కోరిన డబ్బులు తీసుకొని చందంపేటకు వెళ్లిన మల్లేశం నుండి సర్వేయర్ల సమావేశంలో ఉన్న నాగరాజు 15,000 రూపాయల లంచం తీసుకుంటుండగా పట్టుకున్నామని రమణామూర్తి, ఏసీబీ డీఎస్పీ తెలిపారు. ప్రజలను రైతులను ఎవరైనా అధికారులు లంచం అడిగితే ఏసీబీ డిపార్ట్మెంట్ కు చెందిన టోల్ ఫ్రీ నెంబర్ 1064 కు కానీ, వాట్సాప్ నెంబర్ 9440446106కు, లేక ట్విట్టర్ ఫేస్బుక్ ద్వారా ఫిర్యాదు చేయాలని , ఏసీబీ డీఎస్పీ రమణామూర్తి తెలియజేశారు.

## ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఆగ్రహం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన "సామాజిక తెలంగాణ" వ్యాఖ్యలపై మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తీవ్రంగా స్పందించారు. "కవిత ఇప్పుడు సామాజిక తెలంగాణ అంటూ కొత్త నినాదం అందుకుంది" అని ఆయన ఎద్దేవా చేశారు. 2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కేవలం ముగ్గురు బీసీలకు మాత్రమే మంత్రివర్గంలో స్థానం కల్పించారని గుర్తుచేశారు. "ఆనాడు బీసీల గురించి మీ నాన్నను ఎందుకు అడగలేదు? అప్పుడు సామాజిక న్యాయం ఎటు పోయింది?" అని రఘునందన్ రావు నిలదీశారు. కవిత చేసే తాటాకు చప్పుళ్లకు, ఉడత ఊపులకు బీజేపీ భయపడబోదని ఆయన అన్నారు. కాగా, కవిత బీఆర్ఎస్ పార్టీ నుంచి బయటకు వచ్చి, జూన్ 2న కొత్త రాజకీయ పార్టీ పెట్టబోతున్నారంటూ వార్తలు విస్తృతంగా ప్రచారంలోకి వచ్చాయి. అయితే ఆమె పార్టీ ఏర్పాటు ప్రచారాన్ని ఖండించారు. అదే సమయంలో, ఈరోజు తెలంగాణ జాగృతి ద్వారా ఆమె మళ్లీ క్రియాశీలకంగా మారడంతో పాటు కొత్త కార్యాలయాన్ని ప్రారంభించారు.

## రఫేల్ కూలాయన్న సీడీఎస్‌ను దేశద్రోహి అంటారా?: ఉత్తమ్ కుమార్ రెడ్డి నిలదీత




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** (భారత వాయుసేనకు అవసరమైన ఫైటర్ జెట్లు, ఆయుధ సంపత్తిని సకాలంలో సమకూర్చేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. కీలకమైన "ఆపరేషన్ సిందూర్" సమయంలో భారత్ ఎన్ని యుద్ధ విమానాలను కోల్పోయిందో దేశ ప్రజలకు స్పష్టంగా వివరించాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని ఆయన అన్నారు. రక్షణ వ్యవహారాల్లో పారదర్శకత ఉండాలని, విజయాలతో పాటు ఎదురైన సవాళ్లను కూడా ప్రజల ముందుంచాలని ఆయన సూచించారు.శనివారం మీడియాతో మాట్లాడుతూ పలు కీలక అంశాలపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. "రఫేల్ యుద్ధ విమానాలు కూలిపోయాయని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించినప్పుడు, కొందరు ఆయనను దేశ వ్యతిరేకిగా చిత్రీకరించారు. అయితే, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) స్వయంగా ఒక ఇంటర్వ్యూలో రఫేల్ విమానాలు కూలిన విషయాన్ని అంగీకరించారు. మరి ఇప్పుడు సీడీఎస్ వ్యాఖ్యలపై ఏమంటారు? ఆయనను కూడా దేశ వ్యతిరేకి అంటారా?" అని నిలదీశారు.ఆపరేషన్ సింధూర్ వివరాలను వెల్లడించాలని కోరుతూ, పాకిస్థాన్‌కు చెందిన ఎన్ని ఫైటర్ జెట్లు కూలిపోయాయో కూడా కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. "దేశంలో తగినన్ని యుద్ధ విమానాలు అందుబాటులో లేకపోవడం ఆందోళనకరమైన విషయం. ఇది దేశ భద్రతకు ఎంతమాత్రం మంచిది కాదు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆపరేషన్ సిందూర్ విషయంలో కాంగ్రెస్ పార్టీ ఎలాంటి రాజకీయం చేయడం లేదని, దేశ ప్రయోజనాల దృష్ట్యానే తాము మాట్లాడుతున్నామని స్పష్టం చేశారు. యుద్ధానికి సంబంధించిన విషయాలను రహస్యంగా ఉంచాల్సిన అవసరం లేదని, వాస్తవాలను ప్రపంచానికి, దేశ ప్రజలకు బహిరంగంగా తెలియజేయాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి అభిప్రాయపడ్డారు. "కేవలం విజయాలను మాత్రమే కాకుండా, ఆపరేషన్లలో ఎదురైన లోటుపాట్లను, నష్టాలను కూడా ప్రజలకు వివరించాలి. అప్పుడే ప్రభుత్వాలపై ప్రజలకు నమ్మకం కలుగుతుంది" అని ఆయన హితవు పలికారు. వాయుసేనను పటిష్టం చేయడం, వారికి అవసరమైన ఆయుధాలను, సాంకేతిక పరిజ్ఞానాన్ని సకాలంలో అందించడం కేంద్ర ప్రభుత్వ ప్రాథమిక విధి అని ఆయన గుర్తుచేశారు.

## ఈటెల, హరీష్ భేటీ.. ? కాళేశ్వరం కోసమేనా !

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్):** వచ్చేవారంలో కాళేశ్వరం విచారణ వ్యవహారం హాట్ టాపిక్ కానుంది. కమిషన్ ఇప్పటికే మాజీ సీఎం కేసీఆర్ తో పాటు మాజీ మంత్రులు హరీశ్ రావు, ఈటల రాజేందర్ కు నోటీసులు ఇచ్చింది. విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. కాళేశ్వరం కమిషన్ ఎదుట వీళ్ళంతా హాజరవుతుండటంతో తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. ఈమధ్యే ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో హరీష్ రావుతో కెసిఆర్ భేటీ అయ్యారు. గంటలపాటు మంతనాలు జరిపారు. ఆ తర్వాత రిటైర్డ్ ఇంజినీర్లతో కూడా సమావేశం అయ్యారు. నాడు కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో జరిగిన పరిణామాలపై చర్చించారు. అయితే మొదట్లో కాళేశ్వరం కమిషన్ ఎదుట విచారణకు కేసిఆర్ హాజరు కాబోరని గులాబీ మీడియా వార్తలు ప్రచురించింది. ఆ తర్వాత కేసీఆర్ మనసు మార్చుకొని విచారణకు సిద్ధమయ్యారు. బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు భేటీ అయినట్టు పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ చెబుతున్నారు. రెండు రోజుల క్రితం షామీర్ పేటలోని వ్యవసాయ క్షేత్రంలో హరీష్ రావు, ఈటల రాజేందర్ రహస్యంగా కలుసుకున్నారని ఆరోపించారు. ఆ తర్వాత వాళ్ళిద్దరూ కేసీఆర్ తో మాట్లాడారని తెలిపారు. కాళేశ్వరం కమిషన్ ముందు ఏం మాట్లాడాలో అని చర్చించుకున్నారని.... ఈ భేటీ అత్యంత రహస్యంగా జరిగినట్టు పీసీసీ చీప్ చెప్పారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం నిర్మాణంలో అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడ్డారని మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. హరీశ్, ఈటల పైకి ప్రత్యర్థులుగా కనిపిస్తున్నా, లోపల మాత్రం ఒకటే అన్నారు. కాళేశ్వరం విషయంలో కమిషన్ కు వాస్తవాలు చెప్పి, ఈటెల రాజేందర్ మోడీ మనిషి అనిపించుకుంటారా లేదా కేసీఆర్ కు అనుకూలంగా చెప్పి బీజేపీ వ్యతిరేకి అనిపించుకుంటారా అనేది ఈటెల రాజేందర్ తేల్చుకోవాలని మహేష్ కుమార్ గౌడ్ సవాల్ విసిరారు. కాళేశ్వరం పథకం నిర్మాణంలో ఇష్టానుసారంగా వ్యవహరించారు. అక్రమాలకు పాల్పడ్డారు. దాని ఫలితాలు కూడా ప్రజలకు కనిపిస్తున్నాయి. కమిషన్ ముందుకు వస్తే... నాటి ప్రభుత్వ పెద్దల అవినీతి ప్రజల ముందు బయటపడుతుందని అన్నారు. కమిషన్ ముందు విచారణకు హాజరు కాకపోతే ఇజ్జత్ పోతుందని భయపడ్డారని మహేష్ కుమార్ గౌడ్ ఎద్దేవా చేశారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588